TG/TEL/25/A3731

# నిజం
దృష్టి తెలుగు న్యూస్

WANTED
రిపోర్టర్లు కావలెను
నిజం దృష్టి తెలుగు న్యూస్
దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లోని అన్ని జిల్లా కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
ఆయా జిల్లాల్లోని రాజకీయాలు, ఇతర అంశాలపై లోతైన విశ్లేషణలు రాయగల సామర్థ్యం ఉండాలి, అనుభవం గల వారికి ప్రాదాన్యత ఇవ్వబడును.
సెల్: 9247842354

హైదరాబాద్ ఎడిటర్: వరుదు సుజాత సంపుటి:-1 సంచిక:-215 పేజీలు:-4 శనివారం 18-07-2026

SIMULTANEOUSLY PRINTED AT ADHILABAD I HYDERABAD |NALGONDA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | WARANGAL | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ANANTAPUR | GUNTUR| KADAPA | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM

# ధరణి పోర్టల్‌పై సిట్ విచారణ


- తెలంగాణ మంత్రివర్గం కీలక నిర్ణయాలు
- తెలంగాణ ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది
- ప్రత్యేకంగా ధరణి పోర్టల్‌పై సిట్ విచారణ చేయాలని నిర్ణయించగా..
- బుల్లెట్ రైలు, మెట్రో రైలు తదితర అంశాలపై తెలంగాణ మంత్రివర్గం నిర్ణయాలు తీసుకుంది
- మంత్రివర్గంలో ఏమేం నిర్ణయాలు తీసుకున్నారో తెలుసుకుందాం.




తెలంగాణలో అత్యంత వేగంగా మారుతున్న కీలక రాజకీయ పరిణామాల నేపథ్యంలో తెలంగాణ మంత్రివర్గ సమావేశమైంది. కీలక అంశాలపై చర్చించిన తెలంగాణ మంత్రిమండలి ధరణి పోర్టల్‌పై సిట్ విచారణ చేయాలని నిర్ణయించింది. నీటి పారుదల ప్రాజెక్టులపై మంత్రిమండలి అంచనాలు సవరించింది. హైదరాబాద్

## అల్పపీడన ప్రభావం

తెలంగాణలో వానలు ఉక్కపోత నుంచి ఉపశమనం



- బంగాళాఖాతంలో అల్పపీడనంతో తెలంగాణలో వర్షాలు
- ఉక్కపోత నుంచి ప్రజలకు తాత్కాలిక ఉపశమనం
- ఈ నెల 22 వరకు పలుచోట్ల వానలు కురిసే అవకాశం
- ఆందోళనలో ఉన్న రైతులకు ప్రస్తుత వర్షాలతో ఊరట
- హైదరాబాద్ సహా పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో జల్లులు

గత కొన్ని రోజులుగా తీవ్రమైన ఎండలు, ఉక్కపోతతో అల్లాడుతున్న తెలంగాణ ప్రజలకు - మిగతా 2 లో

## మంత్రి వాకిటి శ్రీహరికి అస్వస్థత.. కేర్ ఆసుపత్రిలో చికిత్స



- తీవ్ర జ్వరం, ఇన్ఫెక్షన్‌తో బాధపడుతున్న వాకిటి శ్రీహరి
- రెస్ట్ తీసుకుంటే సరిపోతుందన్న వైద్యులు
- శ్రీహరి ఆరోగ్య గురించి వాకబు చేసిన రేవంత్ రెడ్డి

తెలంగాణ రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి అస్వస్థతకు గురయ్యారు. ఆయనను కుటుంబ - మిగతా 2 లో

## అమెరికా దాడులతో విద్యుత్ సంక్షోభం

ప్రజలకు ఇరాన్ ప్రభుత్వం కీలక సూచన



- విద్యుత్ మౌలిక సదుపాయాలపై దాడులు జరిగాయని తొలిసారి అంగీకరించిన ఇరాన్
- అమెరికా వైమానిక దాడుల నేపథ్యంలో ప్రకటన
- తీవ్రమైన వేడి కారణంగా విద్యుత్ వాడకాన్ని తగ్గించాలని ప్రజలకు విజ్ఞప్తి
- హర్మూజ్ జలసంధిపై ఉద్రిక్తతల మధ్య కొనసాగుతున్న అమెరికా దాడులు

అమెరికాతో ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో, తమ దేశ విద్యుత్ మౌలిక సదుపాయాలపై దాడులు జరుగుతున్నట్లు ఇరాన్ తొలిసారిగా

## భారత్‌పై ఫిర్యాదు.. ఖర్చు మొత్తం భరిస్తున్న పాక్

సింధు జలాల వివాదంలో ట్విస్ట్

- సింధు జలాల వివాదంపై అంతర్జాతీయ మధ్యవర్తిత్వ సంస్థను ఆశ్రయించిన పాక్
- విచారణను బహిష్కరించిన భారత్
- భారత ఖర్చులనూ చెల్లిస్తున్న పాక్
- ఇప్పటి వరకు రూ.5.2 కోట్లకు పైగా ఖర్చు
- మున్ముందు మరింత పెరగనున్న భారం



భారత్‌పై అంతర్జాతీయ మధ్యవర్తిత్వ సంస్థను ఆశ్రయించిన పాకిస్థాన్‌కు ఇప్పుడు అదే కేసు భారంగా మారింది. సింధు జలాల

# భారత్‌లో సరికొత్త శకం

తొలి హైడ్రోజన్ రైలును ప్రారంభించిన ప్రధాని మోదీ

- హర్యానాలో తొలి హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్ రైలుకు పచ్చజెండా ఊపిన ప్రధాని
- జింద్-సోనిపట్ మధ్య పరుగులు పెట్టనున్న హైడ్రోజన్ రైలు
- హర్యానాలో రూ.12,470 కోట్లకు పైగా విలువైన జాతీయ రహదారుల ప్రాజెక్టులకు శ్రీకారం
- ఢిల్లీ-కత్రా మధ్య ప్రయాణ సమయాన్ని 14 నుంచి 6 గంటలకు తగ్గించనున్న కొత్త ఎక్స్‌ప్రెస్‌వే
- కురుక్షేత్రలో ఎలివేటెడ్ రైల్వే ట్రాక్, కొత్త మెడికల్ కాలేజీలను జాతికి అంకితం




స్వచ్ఛ ఇంధన రవాణా రంగంలో భారతీయ రైల్వే చారిత్రక ముందడుగు వేసింది. దేశంలోనే తొలి హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్ రైలును ప్రధాని నరేంద్ర మోదీ ఈరోజు హర్యానాలో జెండా ఊపి ప్రారంభించారు.

## సౌదీ-ఇరాన్ల మధ్య నలిగిపోతున్న పాకిస్థాన్

హౌతీ దాడుల వేళ సంకటంలో ఇస్లామాబాద్!




- 'హర్మూజ్' సంక్షోభం, హౌతీ దాడుల నేపథ్యంలో తీవ్ర ఒత్తిడిలో పాకిస్థాన్
- సౌదీ అరేబియాతో ఉన్న దశాబ్దాల రక్షణ ఒప్పందాలను నిలబెట్టుకోవాల్సిన సవాలు
- పొరుగు దేశమైన ఇరాన్‌తో సంబంధాలు దెబ్బతినకుండా మధ్యవర్తిత్వానికి పాక్ ప్రయత్నాలు
- సౌదీ చమురు క్షేత్రాలపై దాడులు జరిగితే సైనిక సాయం చేయడానికి ఇస్లామాబాద్ సిద్ధం?
- పశ్చిమాసియాలో సంక్షోభం ముదిరితే పాక్ ఆర్థిక వ్యవస్థ పూర్తిగా కుప్పకూలే ప్రమాదం

హర్మూజ్ జలసంధి కేంద్రంగా పశ్చిమాసియాలో చెలరేగిన యుద్ధ జ్వాలలు ఇప్పుడు - మిగతా 2 లో

## యూపీలో ప్రతిపక్షాల లక్ష్యం అరాచకమే

వారు జిన్నా ఆరాధకులు: సీఎం యోగి ఆదిత్యనాథ్



- ప్రతిపక్ష కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీలు జిన్నా ఆరాధకులంటూ సీఎం యోగి తీవ్ర వ్యాఖ్యలు
- షామ్లీలో రూ.581 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- 2017కు ముందు షామ్లీ ఉగ్రవాదానికి, వలసలకు కేంద్రంగా ఉండేదని విమర్శ
- డబుల్ ఇంజిన్ ప్రభుత్వంతో యూపీ స్వరూపమే మారిపోయిందని వ్యాఖ్య
- చెరకు రైతులకు మెరుగైన ధర, చెల్లింపులు అందుతున్నాయని వెల్లడి

ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ప్రతిపక్షాలైన కాంగ్రెస్, సమాజ్‌వాదీ - మిగతా 2 లో

## వైసీపీ ప్రభుత్వం చేసిందే ఇప్పుడు

కూటమి ప్రభుత్వం చేస్తోంది



- అమ్మఒడి ఒక్క బిడ్డకే ఇచ్చి వైసీపీ మోసం చేసిందన్న షర్మిల
- కూటమి ప్రభుత్వం కూడా తల్లులను మోసం చేస్తోందని విమర్శ
- మిగతా 20 లక్షల మంది బిడ్డలకు పథకాన్ని అందజేయాలని డిమాండ్

కూటమి ప్రభుత్వంపై ఏపీ కాంగ్రెస్ చీఫ్ వైఎస్ షర్మిల తీవ్ర విమర్శలు గుప్పించారు. - మిగతా 2 లో

# గత విధ్వంసం నుంచి ఏపీని కేంద్రమే నిలబెట్టింది

నరసరావుపేటలో సీఎం చంద్రబాబు

- గత పాలన విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని కేంద్రమే ఆదుకుందని సీఎం చంద్రబాబు వ్యాఖ్య
- నరసరావుపేటలో కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌తో కలిసి రుణాల పంపిణీ
- వివిధ వర్గాల లబ్ధిదారులకు రూ.3,216 కోట్ల రుణాలు అందజేత
- కేంద్ర సహకారంతో రాష్ట్రంలోని అధిక వడ్డీ అప్పుల రీషెడ్యూల్ చేశామన్న సీఎం
- 2047 నాటికి ఏపీని హెల్తీ, వెల్తీ, హ్యాపీ సొసైటీగా తీర్చిదిద్దుతామని వెల్లడి




గత ఐదేళ్ల పాలనలో జరిగిన విధ్వంసం నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని కేంద్ర ప్రభుత్వమే నిలబెట్టిందని, ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్రం అందించిన సహకారంతోనే రాష్ట్రం తిరిగి గాడిన పడుతోందని ముఖ్యమంత్రి

## హైదరాబాద్‌ను చూసిన ప్రతిసారి అసూయ కలుగుతుంది



- అదే నాలో కసిని పెంచింది: మంగళగిరిలో మంత్రి నారా లోకేశ్
- మంగళగిరిలో రైల్వే స్టేషన్ ప్రారంభోత్సవంలో మంత్రి నారా లోకేశ్ ప్రసంగం
- 91 వేల మెజారిటీతో గెలిపించిన ప్రజల రుణం తీర్చుకుంటానని భావోద్వేగ ప్రసంగం
- డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి సాధ్యమని స్పష్టీకరణ

"హైదరాబాద్‌ను చూసిన ప్రతిసారీ నాకు అసూయ కలుగుతుంది. అక్కడి విమానాశ్రయం, రైల్వే స్టేషన్లు, ఐటీ టవర్లు - మిగతా 2 లో

# అల్పపీడన ప్రభావం

మొదటిపేజీ తరువాయి - వాతావరణ శాఖ చల్లని కబురు అందించింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. పలు జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురుస్తుండటంతో ప్రజలకు వేడి నుంచి ఉపశమనం లభించింది. ఈ నెల 22వ తేదీ వరకు రాష్ట్రంలో పలుచోట్ల వర్షాలు కొనసాగే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. బంగాళాఖాతంలో ఉత్తర ఒడిశా-పశ్చిమబెంగాల్ తీర ప్రాంతంలో అల్పపీడనం ఏర్పడింది. దీనికి అనుబంధంగా మరో ద్రోణి కొనసాగుతోంది. వీటి ప్రభావంతో తెలంగాణలో ముఖ్యంగా ఉత్తర, మధ్య జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో బలమైన ఈదురు గాలులు కూడా వీచే అవకాశం ఉందని హెచ్చరించారు. ఇప్పటికే ఇవాళ తెల్లవారుజామున హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. రేపు ఉత్తర తెలంగాణ జిల్లాల్లో బలమైన ఉపరితల గాలులు వీస్తాయని అంచనా వేస్తున్నారు. నిన్న సాయంత్రం నుంచే రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వాతావరణం చల్లబడింది. రంగారెడ్డి జిల్లా రెడ్డిపల్లిలో 4.3 సెంటీమీటర్లు, నల్గొండ జిల్లా చండూరులో 3.5 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. రంగారెడ్డి, సంగారెడ్డి, వికారాబాద్, మహబూబ్‌నగర్, ములుగు, మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు జల్లులు పడ్డాయి. నిన్న పగటిపూట నిజామాబాద్‌లో సాధారణం కన్నా 3.8 డిగ్రీలు అధికంగా 35.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా, సాయంత్రానికి వాతావరణం చల్లబడటం గమనార్హం. నైరుతి రుతుపవనాలు రాష్ట్రంలో ప్రవేశించినప్పటికీ ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఖరీఫ్ సాగు పనులు నెమ్మదించాయి. ఇలాంటి తరుణంలో అల్పపీడనం కారణంగా కురుస్తున్న ఈ వర్షాలు వ్యవసాయ పనులకు ఊతమిస్తాయని, పంటలకు జీవం పోస్తాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు లేకపోయినా, ఈ జల్లులు ఎండల తీవ్రతను తగ్గించి ప్రజలకు, రైతులకు కొంత ఊరటనిస్తున్నాయి.

## మంత్రి వాకిటి శ్రీహరికి అస్వస్థత.. కేర్ ఆసుపత్రిలో చికిత్స

మొదటిపేజీ తరువాయి - సభ్యులు హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని కేర్ ఆసుపత్రికి తరలించారు. తీవ్ర జ్వరం, ఇన్ఫెక్షన్‌తో బాధపడుతున్న మంత్రికి వైద్యులు చికిత్స అందిస్తున్నారు. గత రెండు రోజులుగా ఆయన ఆరోగ్యం సరిగా లేదని కుటుంబ సభ్యులు వెల్లడించారు. ప్రస్తుతం మంత్రి వాకిటి శ్రీహరి ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. మరో రెండు రోజుల రెస్ట్ తీసుకుంటే సరిపోతుందని స్పష్టం చేశారు. మంత్రి త్వరగా కోలుకోవాలని అభిమానులు, పార్టీ నాయకులు ఆకాంక్షిస్తున్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి, ఇతర మంత్రులు, పార్టీ నాయకులు మంత్రి వాకిటి ఆరోగ్యం గురించి ఆరా తీశారు. వాకిటి శ్రీహరి త్వరగా పూర్తి కోలుకుని ప్రజా సేవలో కొనసాగాలని పార్టీ శ్రేణులు ఆకాంక్షిస్తున్నాయి.

## గత విధ్వంసం నుంచి ఏపీని కేంద్రమే నిలబెట్టింది

స్పష్టం చేశారు. పల్నాడు జిల్లా నరసరావుపేటలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో కలిసి ఆయన 'క్రెడిట్ అవుట్ రీచ్' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో చంద్రబాబు మాట్లాడుతూ.. కేంద్రం అందిస్తున్న చేయూత వల్లే రాష్ట్రం ఆర్థికంగా నిలదొక్కుకోగలుగుతోందని అన్నారు. అమరావతి, పోలవరం ప్రాజెక్టులతో పాటు విశాఖ స్టీల్ ప్లాంట్ విషయంలోనూ కేంద్రం రాష్ట్రానికి అండగా నిలిచిందని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ పథకాల కింద 1,03,246 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ రూ.3,216 కోట్ల రుణాలను పంపిణీ చేశారు. అనంతరం బాలికలకు సైకిళ్లను అందజేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల అంతిమ లక్ష్యం ప్రజల జీవన ప్రమాణాలు పెంచడమేనని అన్నారు. ఒకప్పుడు రుణాల కోసం బ్యాంకుల చుట్టూ తిరగాల్సి వచ్చేదని, ఇప్పుడు బ్యాంకులే ప్రజల వద్దకు వచ్చి రుణాలు ఇవ్వడం శుభపరిణామమని పేర్కొన్నారు. ఈ రుణమేళా ద్వారా వ్యవసాయ రంగానికి రూ.2,363 కోట్లు, ఎంఎస్‌ఎంఈలకు రూ.325 కోట్లు, గృహ, విద్య, ఇతర రంగాలకు రూ.624 కోట్లు అందించినట్లు వివరించారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ నాయకత్వ పటిమను చంద్రబాబు ప్రత్యేకంగా ప్రశంసించారు. దేశంలో మొండి బకాయిలపై (ఛీూూ) కఠినంగా వ్యవహరించి, డిజిటల్ బ్యాంకింగ్ విప్లవాన్ని తీసుకొచ్చిన ఘనత ఆమెకే దక్కుతుందన్నారు. జీఎస్టీ విధానంలో మార్పులు చేసి ప్రభుత్వ ఆదాయాన్ని పెంచారని కొనియాడారు. గత ప్రభుత్వ హయాంలో చేసిన అధిక వడ్డీ అప్పులను కేంద్రం సహకారంతో రీషెడ్యూల్ చేశామని, దీని ద్వారా రాష్ట్రానికి రూ.1,538 కోట్ల మేర ఆదా అయిందని తెలిపారు. రాయలసీమను హార్టికల్చర్ హబ్?గా మార్చేందుకు కేంద్రం రూ.40 వేల కోట్ల సహకారం అందిస్తోందని, ప్రైవేటు పెట్టుబడులతో ఈ ప్రాంతాన్ని ఉద్యానవన కేంద్రంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలోని డ్వాక్రా మహిళలు పొదుపులో, రుణాల చెల్లింపులో దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నారని, వారిని వ్యాపారవేత్తలుగా మార్చేందుకు 'వన్ ఫ్యామిలీ, వన్ ఎంట్రప్రెన్యూర్' కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. 2047 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను హెల్తీ, వెల్తీ, హ్యాపీ సొసైటీగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని చంద్రబాబు పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, పలువురు బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.

## వైసీపీ ప్రభుత్వం చేసిందే ఇప్పుడు

మొదటిపేజీ తరువాయి - "తల్లికి వందనానికి పంగనామం-బిడ్డలకు ఎగనామం" ఇదే కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్ హామీ అంటూ ఆమె విమర్శించారు. అంతేకాదు గత ముఖ్యమంత్రి జగన్‌కి వారసుడు నేటి సీఎం చంద్రబాబు అంటూ ఆమె ఎద్దేవా చేశారు. గత వైసీపీ మోసాలను తు.చ తప్పకుండా పాటించడం కూటమి ప్రభుత్వ విధానమైందని మండిపడ్డారు. అమ్మఒడి పేరుతో ఒక్క బిడ్డకే ఇచ్చి వైసీపీ ప్రభుత్వం తల్లులను పచ్చిమోసం చేసిందని వ్యాఖ్యానించారు. "నీకు 15, నీకు 15, ఎంతమంది ఉంటే అన్ని 15 వేలు అని చెప్పిన చంద్రబాబు... ఇప్పుడు చంద్రబాబు తల్లులను నయవంచన చేస్తున్నారని షర్మిల ఆరోపించారు. కోతల రాయుడు కోతలంటూ జగన్ ను ఎద్దేవా చేసిన చంద్రబాబే మళ్లీ కోతలకు బ్రాండ్ అంబాసిడర్ అయ్యారని విమర్శించారు. తల్లికి వందనంపై నిజంగా చంద్రబాబుకు చిత్తశుద్ధి ఉంటే 87 లక్షల మంది బిడ్డలకి ఇవ్వాల్నారు. కోతలు పెట్టకుండా ప్రతి బిడ్డకు 15 వేలు జమ చేయాలన్నారు. కొర్రీలు పెట్టకుండా మిగతా 20 లక్షల మంది బిడ్డలకు పథకాన్ని అందజేయాలని డిమాండ్ చేశారు. గత వైసీపీ పాలనలో అమ్మఒడి పథకం కింద ఒక్కబిడ్డకే ఇచ్చి తల్లులను మోసం చేశారని... ఇప్పుడు కూటమి ప్రభుత్వం కూడా అదే మార్గం అనుసరిస్తోందని షర్మిల ఆరోపించారు. తల్లికి వందనం పథకం కేవలం ఎన్నికల ముందు ఇచ్చిన హామీగా మిగిలిపోయిందని విమర్శించారు.

## హైదరాబాద్‌ను చూసిన ప్రతిసారి అసూయ కలుగుతుంది

మొదటిపేజీ తరువాయి - చూసినప్పుడు కలిగే ఆ అసూయే.. నాలో కసిని పెంచింది. ఆంధ్రప్రదేశ్‌ను దక్షిణ భారతదేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దగలమన్న నమ్మకాన్ని ఇచ్చింది" అని రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ శక్తిమంతమైన ప్రసంగం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం వర్చువల్ విధానంలో ప్రారంభించిన ఆధునిక హంగులతో కూడిన మంగళగిరి రైల్వే స్టేషన్ ప్రారంభోత్సవ సభలో లోకేశ్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. తన ప్రసంగంలో అభివృద్ధి, రాజకీయాలు, వ్యక్తిగత ప్రస్థానాన్ని కలగలిపి, ప్రజల్లో నూతనోత్సాహం నింపారు. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశంలో రైల్వే వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయని లోకేశ్ కొనియాడారు. "ఒకప్పుడు రైళ్లు సమయానికి వచ్చేవి కావు, బోగీలు శుభ్రంగా ఉండేవి కావు. కానీ నేడు వందే భారత్, బుల్లెట్ రైళ్లు, కవచ్ భద్రతా టెక్నాలజీ, 100 శాతం విద్యుదీకరణతో రైల్వే రంగం స్వరూపమే మారిపోయింది. దేశాభివృద్ధికి రైల్వేలే కీలకమని ప్రధాని మోదీ బలంగా విశ్వసిస్తున్నారు" అని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంగళగిరిలో మరిన్ని రైళ్లు ఆగేలా చర్యలు తీసుకోవాలని రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను సభాముఖంగా కోరారు. అమరావతి అభివృద్ధిపై లోకేశ్ తన దార్శనికతను స్పష్టం చేశారు. "రాజధాని అమరావతికి రోడ్డు, రైలు, వాయు మార్గాల అనుసంధానం అత్యంత కీలకం. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు ఈ మూడింటినీ అనుసంధానిస్తూ ఒక ఇంటిగ్రేటెడ్ లాజిస్టిక్స్ నెట్‌వర్క్‌ను రూపొందిస్తున్నారు. 2019-24 మధ్య ఆగిపోయిన అమరావతి పనులను ఇప్పుడు చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ గారు పరుగులు పెట్టిస్తున్నారు. అమరావతిని ఒక గ్లోబల్ సిటీగా మార్చడమే మా అందరి లక్ష్యం" అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో చంద్రబాబు ఉన్న 'డబుల్ ఇంజన్ సర్కార్'తోనే ఇది సాధ్యమని ఆయన అన్నారు. దశాబ్దాల కల అయిన విశాఖ కేంద్రంగా సౌత్ కోస్ట్ రైల్వే జోన్‌ను ప్రధాని మోదీ ఆచరణలోకి తెచ్చారని గుర్తుచేశారు. ఈ సందర్భంగా మంగళగిరితో తనకున్న అనుబంధాన్ని, రాజకీయ ప్రయాణాన్ని లోకేశ్ భావోద్వేగంగా పంచుకున్నారు. "2019లో 5,300 ఓట్లతో ఓడిపోయినప్పుడు కుంగిపోలేదు. ఐదేళ్లు మీ మధ్యనే ఉన్నా, చెమటోడ్చి కష్టపడ్డా, మీ మనసు గెలుచుకున్నా. నేను ఏ మెజారిటీతో అయితే ఓడిపోయానో, దాని పక్కన ఒక సున్నా పెట్టి గెలిపించాలని కోరాను. మీరు నా మాట నిలబెట్టారు. ఆంధ్రప్రదేశ్ చరిత్రలోనే టాప్-3 మెజారిటీతో, 91 వేల ఓట్ల ఆధిక్యంతో నన్ను గెలిపించి శాసనసభకు పంపించారు. ఈ గెలుపు నాకు కొండంత బలాన్నిచ్చింది, నాపై బాధ్యతను పెంచింది" అని అన్నారు. ఈ మెజారిటీని చూపించే కేంద్ర, రాష్ట్ర మంత్రులపై ఒత్తిడి తెచ్చి నియోజకవర్గానికి పనులు చేయిస్తున్నానని తెలిపారు. ఎమ్మెల్యే, ఎంపీ కలిసి పనిచేస్తే ఒక ప్రాంతం ఎంత అద్భుతంగా అభివృద్ధి చెందుతుందో చెప్పడానికి మంగళగిరి ఒక ఉదాహరణ అని లోకేశ్ అన్నారు. ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్‌తో కలిసి పనిచేస్తూ లక్ష్మీ నరసింహ స్వామి గుడి అభివృద్ధికి, భూగర్భ డ్రైనేజీ వంటి పనులకు కేంద్రం నుంచి నిధులు సాధిస్తున్నామని వివరించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందికరంగా ఉన్నా, సంక్షేమం, అభివృద్ధిని జోడెద్దుల బండిలా ముందుకు తీసుకెళుతున్నామని తెలిపారు. రాయల్ ఎన్‌ఫీల్డ్, గూగుల్, అదానీ అంకా వంటి పెద్ద కంపెనీలు ఏపీ వైపు చూస్తున్నాయని, రాబోయే మూడేళ్లలో యువత ఉద్యోగాల కోసం పక్క రాష్ట్రాలకు వెళ్లాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. తనను గెలిపించిన ప్రజల కోసం అహర్నిశలు కష్టపడతానని, వారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని కోరుతూ లోకేష్ తన ప్రసంగాన్ని ముగించారు.

# ధరణి పోర్టల్‌పై సిట్ విచారణ

మొదటిపేజీ తరువాయి - మెట్రో రైలు రెండో దశ పురోగతప.. ఎల్‌నినో ప్రభావం, తాగునీటి భద్రతపై మంత్రిమండలి చర్చ జరిగింది. హైదరాబాద్‌లోని సచివాలయంలో గురువారం జరిగిన మంత్రిమండలి సమావేశం కొన్ని గంటల పాటు సాగింది. నీటిపారుదల ప్రాజెక్టులపై మంత్రిమండలి సమీక్ష చేసింది. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుతోపాటు నిర్మాణంలో ఉన్న ఇతర సాగునీటి ప్రాజెక్టులపై, మెట్రో రైలు రెండో దశ పురోగతిపై, కేంద్రం కమిటీ ఏర్పాటు జాప్యంపై ప్రభుత్వ వైఖరిపై మంత్రిమండలి చర్చ చేసింది. ఎల్-నినో ప్రభావం, తాగునీటి భద్రత చర్యలపై చర్చించింది. బుల్లెట్ ట్రైన్ భూ సేకరణ, వ్యయ అంశాలపై చర్చ, మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు పురోగతిపై మంత్రిమండలి చర్చ చేసింది. కృష్ణా--గోదావరి జల వివాదం, సుప్రీంకోర్టు వ్యవహారంపై వ్యూహం వంటి పలు కీలక పరిపాలనా, అభివృద్ధి ప్రతిపాదనలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ధరణి పోర్టల్ అక్రమాలపై సిటి విచారణ కు కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. జగిత్యాల జిల్లా డిగ్రీ కాలేజీలో పలు పోస్టులకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. హాస్స్ చెరులో ఇందిరమ్మ ఇళ్ల కోసం భూమి కేటాయింపుకు మంత్రిమండలి నిర్ణయించింది. బుల్లెట్ ట్రైన్ అలైన్‌మెంట్ మార్పునకు మంత్రివర్గం పచ్చజెండా ఊపింది. తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం--2018 సవరణకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. పలు పరిపాలనా, అభివృద్ధి అంశాలకు మంత్రివర్గం ఆమోద ముద్ర వేసింది.

### విచారణకు సిద్ధం

ధరణి అక్రమాలపై సిట్ విచారణకు ప్రభుత్వం సిద్ధమైంది. ధరణి పోర్టల్‌లో జరిగిన అక్రమాలపై సమగ్ర దర్యాప్తు చేయాలని మంత్రివర్గం నిర్ణయించింది. ధరణి పోర్టల్‌పై ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటుకు కసరత్తు చేస్తోంది. భూ రికార్డుల మార్పులు, అక్రమ మ్యూటేషన్లపై విచారణకు మంత్రిమండలి నిర్ణయించింది. ప్రభుత్వ, అసైన్డ్, వక్ఫ్, దేవాదాయ భూముల లావాదేవీలపై దృష్టి సారించింది. అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలకు ప్రభుత్వం సిద్ధమైందని ప్రకటించింది. అవసరమైతే మాజీ అధికారులు, బాధ్యులకు నోటీసులు ఇవ్వాలని.. సాంకేతిక అంశాలపై నిపుణుల సహకారంతో దర్యాప్తు చేయాలని మంత్రివర్గం నిర్ణయించింది. ధరణి ద్వారా జరిగిన భూ వివాదాలన్నింటిపై వివరాల సేకరణ చేసింది. అక్రమంగా లబ్ధి పొందిన వారిపై కేసుల నమోదుకు అవకాశం. ధరణి పోర్టల్‌లో రాష్ట్రవ్యాప్తంగా ఫిర్యాదులు, పత్రాల పరిశీలన ప్రారంభమైంది. బాధితులకు న్యాయం చేయడమే లక్ష్యమని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. భూ పరిపాలనలో పారదర్శకతకు ప్రభుత్వం చర్యలు తీసుకోనుందని.. సిట్ విచారణతో ధరణి అక్రమాల అసలు నిజాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని సమాచారం.

# అమెరికా దాడులతో విద్యుత్ సంక్షోభం

మొదటిపేజీ తరువాయి - అంగీకరించింది. మరోవైపు, దేశంలోని దక్షిణ ప్రావిన్సులలో తీవ్రమైన వేడిగాలులు వీస్తుండటంతో విద్యుత్ వినియోగాన్ని తగ్గించాలని ప్రజలకు విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఇరాన్ విద్యుత్ మంత్రిత్వ శాఖ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. దాడుల తీవ్రత అధికంగా ఉన్న దక్షిణ ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇరాన్ ప్రభుత్వం సూచించింది. ఆయా ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు గరిష్ఠ స్థాయికి చేరడం, మరోవైపు విద్యుత్ వ్యవస్థలే లక్ష్యంగా దాడులు జరుగుతుండటంతో ప్రజలు సాధ్యమైనంత వరకు విద్యుత్ ఆదా చేయాలని కోరింది. హార్మూజ్ జలసంధిపై ఆధిపత్యం కోసం అమెరికా, ఇరాన్ మధ్య వివాదం ముదురుతున్న తరుణంలో, ఇరాన్‌లోని పలు లక్ష్యాలపై అమెరికా వైమానిక దాడులను కొనసాగిస్తోంది. గతంలో ఇరాన్‌లోని వంతెనలు, విద్యుత్ ప్లాంట్లపై దాడులు చేస్తామని అమెరికా హెచ్చరించిన విషయం తెలిసిందే. తాజాగా ఇరాన్‌లోని పలు లక్ష్యాలను ఛేదించినట్లు యూఎస్ సెంట్రల్ కమాండ్ ప్రకటించింది. ఈ పరిణామాల నేపథ్యంలో ఇరాన్ ఇంధన మంత్రిత్వ శాఖ చేసిన ప్రకటన ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే, ఈ దాడుల్లో విద్యుత్ ప్లాంట్లు, ట్రాన్స్‌మిషన్ లైన్లు లేదా ఇతర వ్యవస్థలు ఎంతవరకు దెబ్బతిన్నాయనే వివరాలను మాత్రం ప్రభుత్వం వెల్లడించలేదు. గత కొన్ని నెలలుగా కొనసాగుతున్న దాడుల వల్ల విద్యుత్ నెట్‌వర్క్‌లోని దాదాపు 2,000కు పైగా ప్రాంతాల్లో నష్టం వాటిల్లిందని, వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి అంతరాయం ఏర్పడిందని అధికారులు వెల్లడించారు. పాతబడిన వ్యవస్థలు, అంతర్జాతీయ ఆంక్షల కారణంగా ఆధునికీకరణకు నోచుకోకపోవడం, వేసవిలో పెరుగుతున్న డిమాండ్ వంటి కారణాలతో ఇరాన్ విద్యుత్ గ్రిడ్ ఇప్పటికే సంక్షోభంలో ఉంది. తాజా దాడులు ఈ పరిస్థితిని మరింత క్లిష్టతరం చేశాయి. ఈ దాడుల కారణంగా ఇప్పటివరకు 38 మంది మరణించగా, 400 మందికి పైగా గాయపడ్డారని ఇరాన్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ వెల్లడించింది. చబహార్ పోర్టు సమీపంలో కూడా ఆస్తి నష్టం జరిగినట్లు సమాచారం. ప్రస్తుతానికి దేశవ్యాప్తంగా అధికారికంగా విద్యుత్ కోతలు విధించనప్పటికీ, ముందుజాగ్రత్త చర్యగా దక్షిణ ప్రాంత ప్రజలు విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలని ప్రభుత్వం సూచించింది.

# యూపీలో ప్రతిపక్షాల లక్ష్యం అరాచకమే

మొదటిపేజీ తరువాయి - ఆ పార్టీలను 'జిన్నా ఆరాధకులు' అంటూ ఘాటుగా విమర్శించారు. వారికి అవకాశం దొరికినప్పుడల్లా కులం, ప్రాంతం పేరుతో సమాజాన్ని విభజించేందుకు ప్రయత్నిస్తారని ఆయన ఆరోపించారు. అరాచకాన్ని వ్యాప్తి చేయడం, మహిళలు, వ్యాపారుల భద్రతను బలహీనపరచడమే వారి ఏకైక లక్ష్యమని సీఎం యోగి దుయ్యబట్టారు. నేడు షామ్లీ జిల్లాలో రూ.581 కోట్ల విలువైన 89 అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేసిన సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా 2017కు ముందు, ఆ తర్వాత పరిస్థితులను పోల్చి చూస్తూ సీఎం యోగి మాట్లాడారు. ఒకప్పుడు షామ్లీ జిల్లా ఉగ్రవాదానికి, సామూహిక వలసలకు, గూండాయిజానికి కేంద్రంగా ఉండేదని, కానీ నేడు తమ ప్రభుత్వం హయాంలో అభివృద్ధికి చిరునామాగా మారిందని ఆయన అన్నారు. "2017కు ముందు ఇక్కడ అభివృద్ధి పనులు పూర్తిగా నిలిచిపోయాయి. విద్యుత్, భద్రత, వైద్యం వంటి కనీస సౌకర్యాలు దయనీయంగా ఉండేవి. గూండాలు, పోకిరీలు వీధుల్లో బహిరంగంగా తిరిగేవారు. ఆడపిల్లలు ఇళ్ల నుంచి బయటకు రావాలంటే భయపడే పరిస్థితి. రైతులు ఆత్మహత్యలు చేసుకునే దుస్థితి నెలకొని ఉండేది. కానీ డబుల్ ఇంజిన్ ప్రభుత్వం వచ్చిన తర్వాత అవన్నీ గత చరిత్రగా మిగిలిపోయాయి. యూపీ ముఖచిత్రం, తలరాత పూర్తిగా మారిపోయింది" అని యోగి వివరించారు. ఢిల్లీ-డెహ్రాడూన్, షామ్లీ-అంబాలా, ప్రతిపాదిత షామ్లీ-గోరఖ్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌వేల నిర్మాణంతో భవిష్యత్తులో ఈ జిల్లా పశ్చిమ ఉత్తరప్రదేశ్‌తో పాటు ఎన్‌సీఆర్‌లో కీలకమైన అభివృద్ధి కేంద్రంగా మారుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. గత దశాబ్ద కాలంలో యూపీలో జరిగిన పరివర్తన గురించి మాట్లాడుతూ.. ప్రస్తుతం చెరకు, చక్కెర, ఇథనాల్ ఉత్పత్తిలో దేశంలోనే ఉత్తరప్రదేశ్ అగ్రస్థానంలో ఉందని తెలిపారు. 2017లో రాష్ట్రంలోని చక్కెర మిల్లులు తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయాయని, కానీ బీజేపీ ప్రభుత్వం వాటిని విజయవంతంగా గట్టెక్కించిందని యోగి గుర్తుచేశారు. ప్రస్తుతం 122 చక్కెర మిల్లులు పనిచేస్తున్నాయని, చెరకు రైతులకు క్వింటాల్‌కు రూ.400 ధర అందుతోందని, చెల్లింపుల వ్యవస్థ కూడా గతంతో పోలిస్తే ఎంతో మెరుగుపడిందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా 1857 సిపాయిల తిరుగుబాటులో షామ్లీ, కైరానాల చారిత్రక పాత్రను, భారత శాస్త్రీయ సంగీతానికి ఈ ప్రాంతం అందించిన సేవలను సీఎం యోగి స్మరించుకున్నారు.

# భారత్‌పై ఫిర్యాదు.. ఖర్చు మొత్తం భరిస్తున్న పాక్

మొదటిపేజీ తరువాయి - ఒప్పందానికి సంబంధించిన వివాదంలో భారత్ విచారణను బహిష్కరించడంతో, మధ్యవర్తిత్వ ప్రక్రియ ఆగిపోకుండా ఉండేందుకు పాకిస్థానే రెండు దేశాల ఖర్చును భరిస్తోంది. ఇప్పటివరకు ఈ ప్రక్రియ కోసం ఆరు లక్షల డాలర్లకు పైగా అంటే సుమారు రూ.5.2 కోట్లకు పైగా వెచ్చించినట్లు నివేదికలు వెల్లడించాయి. విచారణ కొనసాగుతున్న కొద్దీ ఈ భారం మరింత పెరిగే అవకాశం ఉందని చెబుతున్నాయి. సింధు జలాల ఒప్పందం ప్రకారం వివాదాలు తలెత్తితే మధ్యవర్తిత్వ వ్యయాన్ని భారత్, పాకిస్థాన్ సమానంగా భరించాలి. అయితే 2025 ఏప్రిల్‌లో జరిగిన పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత భారత్ కీలక నిర్ణయం తీసుకుంది. ఉగ్రవాదానికి పాకిస్థాన్ పూర్తిగా చెక్ పెట్టే వరకు సింధు జలాల ఒప్పంద అమలును నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. అదే సమయంలో ఈ వివాదానికి సంబంధించిన మధ్యవర్తిత్వ ప్రక్రియ నుంచి కూడా తప్పుకొంది. కిషన్‌గంగా, రాట్లే జలవిద్యుత్ ప్రాజెక్టులపై పాకిస్థాన్ పర్మినెంట్ కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్‌ను ఆశ్రయించింది. ఈ ప్రాజెక్టుల రూపకల్పన ఒప్పందానికి విరుద్ధమని ఇస్లామాబాద్ వాదిస్తోంది. కానీ ఇది సాంకేతిక అంశమని, ఇలాంటి వివాదాలను కోర్టు కాకుండా తటస్థ నిపుణుడే పరిశీలించాలని భారత్ మొదటి నుంచీ చెబుతోంది. రెండు వ్యవస్థలు ఒకేసారి నడవడం ఒప్పంద నిబంధనలకు విరుద్ధమని కూడా స్పష్టం చేసింది. అంతర్జాతీయ మధ్యవర్తిత్వ నిబంధనల ప్రకారం ఒక పక్షం హాజరు కాకపోయినా ట్రిబ్యునల్‌కు అధికార పరిధి ఉందని భావిస్తే విచారణ కొనసాగించవచ్చు. అదే కారణంతో 'పర్మినెంట్ కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్' పాకిస్థాన్ పిటిషన్‌పై విచారణ కొనసాగిస్తోంది. అయితే ఈ ట్రిబ్యునల్ చట్టబద్ధంగా ఏర్పడలేదని భారత్ చెబుతోంది. అందువల్ల ఆ కోర్టు ఇచ్చే ఎలాంటి తీర్పునూ తాము గుర్తించబోమని ఇప్పటికే స్పష్టం చేసింది. భారత్ విచారణకు హాజరు కాకపోయినా కేసును కొనసాగించాలంటే మొత్తం ఖర్చును పాకిస్థానే భరించాల్సి వస్తోంది. అందుకే తన వాటాతో పాటు భారత్ చెల్లించాల్సిన మొత్తాన్నీ ఇస్లామాబాద్ చెల్లిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే రూ.5.2 కోట్లకు పైగా ఖర్చు చేసినట్లు సమాచారం. విచారణ ఇంకా కొనసాగితే ఈ మొత్తం మరింత పెరిగే అవకాశం ఉంది. ఇప్పటికే పాకిస్థాన్ ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతోంది. అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) నుంచి 7 బిలియన్ డాలర్ల సహాయ ప్యాకేజీపై ఆధారపడుతోంది. పన్నుల పెంపు, సబ్సిడీల కోత, అప్పుల నియంత్రణ వంటి కఠిన షరతుల మధ్య ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టే ప్రయత్నం చేస్తోంది. ఇలాంటి సమయంలో మధ్యవర్తిత్వ ఖర్చు కూడా పెరగడం పాకిస్థాన్‌పై అదనపు భారంగా మారింది.

# భారత్‌లో సరికొత్త శకం

మొదటిపేజీ తరువాయి - రంగంలో భారతీయ రైల్వే చారిత్రక ముందడుగు వేసింది. దేశంలోనే తొలి హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్ రైలును ప్రధాని నరేంద్ర మోదీ ఈరోజు హర్యానాలో జెండా ఊపి ప్రారంభించారు. పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో రూపుదిద్దుకున్న ఈ రైలు, తన ప్రయాణానికి అవసరమైన విద్యుత్‌ను హైడ్రోజన్‌ను ఉపయోగించి స్వయంగా ఉత్పత్తి చేసుకుంటుంది. కేవలం నీటి ఆవిరిని మాత్రమే విడుదల చేస్తూ పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేస్తుంది. ఈ 10 కోచ్‌ల రైలు హర్యానాలోని జింద్, సోనిపట్ మధ్య 90 కిలోమీటర్ల దూరాన్ని కేవలం రెండు గంటల్లో పూర్తి చేస్తుంది. 3,200 హార్స్‌పవర్ సామర్థ్యంతో పనిచేసే ఈ రైలు, ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన హైడ్రోజన్ రైళ్లలో ఒకటిగా నిలిచింది. ఈ ఘనతతో హైడ్రోజన్ రైళ్లను నడుపుతున్న అతికొద్ది దేశాల సరసన భారత్ చేరింది.

### రూ.12,470 కోట్లతో రహదారుల అభివృద్ధి

ఈ కార్యక్రమంతో పాటు హర్యానాలో రూ.12,470 కోట్లకు పైగా విలువైన పలు జాతీయ రహదారుల ప్రాజెక్టులను ప్రధాని మోదీ జాతికి అంకితం చేసి, మరికొన్నింటికి శంకుస్థాపన చేశారు. ఇందులో భాగంగా సుమారు రూ.9,680 కోట్ల వ్యయంతో నిర్మించిన 158 కిలోమీటర్ల పొడవైన ఢిల్లీ-అమృత్‌సర్-కత్రా ఎక్స్‌ప్రెస్‌వేను ప్రారంభించారు. ఈ గ్రీన్‌ఫీల్డ్ కారిడార్ వల్ల ఢిల్లీ-కత్రా ప్రయాణ సమయం 14 గంటల నుంచి 6 గంటలకు, ఢిల్లీ-అమృత్‌సర్ ప్రయాణ సమయం 8 నుంచి 4 గంటలకు తగ్గనుంది. ఇది వైష్ణోదేవి యాత్రికులకు, పర్యాటకులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. అదేవిధంగా అంబాలా-కాలా అంబ్, జింద్-గోహానా జాతీయ రహదారులను కూడా జాతికి అంకితం చేశారు. జింద్-గోహానా రహదారి వల్ల ప్రయాణ సమయం రెండు గంటల నుంచి 40 నిమిషాలకు తగ్గనుంది. హన్సీ-బరవాలా రహదారి విస్తరణ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు.

### వైద్యం, మౌలిక సదుపాయాలకు పెద్దపీట

కురుక్షేత్ర నగరంలో రైల్వే క్రాసింగ్‌ల వద్ద ట్రాఫిక్ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు నిర్మించిన ఎలివేటెడ్ రైల్వే ట్రాక్‌ను కూడా ప్రధాని ప్రారంభించారు. ఇది రైలు, రోడ్డు రవాణా వ్యవస్థల సామర్థ్యాన్ని పెంచుతుంది. రాష్ట్ర ఆరోగ్య వ్యవస్థను బలోపేతం చేసే దిశగా భివానీలోని పండిట్ నేకీ రామ్ శర్మ ప్రభుత్వ వైద్య కళాశాల, నార్నౌల్‌లోని మహర్షి చ్యవన్ మెడికల్ కాలేజీ, రావు తులారామ్ ఆసుపత్రిని జాతికి అంకితం చేశారు. ఈ సంస్థల ద్వారా హర్యానాలో వైద్య విద్య, ఆరోగ్య సేవలు మరింత అందుబాటులోకి రానున్నాయి. వీటితో పాటు సిక్కు గురువుల చరిత్ర, వారి త్యాగాలు, దేశ సంస్కృతికి వారు అందించిన సేవలను ఆధునిక టెక్నాలజీతో ప్రదర్శించేందుకు కురుక్షేత్రలో నిర్మించనున్న సిక్కు మ్యూజియానికి ప్రధాని శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టులన్నీ హర్యానా సమగ్రాభివృద్ధికి దోహదం చేస్తాయని ప్రభుత్వం పేర్కొంది


# సౌదీ-ఇరాన్ల మధ్య నలిగిపోతున్న పాకిస్థాన్

మొదటిపేజీ తరువాయి - పాకిస్తాన్‌ను తీవ్ర సంకటంలోకి నెట్టాయి. ఒకవైపు ఇరాన్ అనుకూల హౌతీ రెబెల్స్ సౌదీ అరేబియా లక్ష్యంగా దాడులకు తెగబడుతుండటంతో.. తన చిరకాల మిత్రదేశమైన సౌదీకి, మరోవైపు పొరుగునే ఉన్న ఇరాన్‌కు మధ్య సమతుల్యతను కాపాడుకోవడానికి పాకిస్థాన్ తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. అటు రక్షణ ఒప్పందాలను గౌరవిస్తూనే, ఇటు ప్రాంతీయ ఉద్రిక్తతలకు దూరంగా ఉండేందుకు ఇస్లామాబాద్ తెరవెనుక దౌత్య నీతిని వేగవంతం చేసింది.

### సౌదీ రక్షణపై తీవ్ర ఒత్తిడి

దశాబ్దాలుగా పాకిస్థాన్ ఆర్థికంగా, వ్యూహాత్మకంగా సౌదీ అరేబియాపైనే ఆధారపడి ఉంది. ఇరు దేశాల మధ్య ఉన్న పాత రక్షణ ఒప్పందాల ప్రకారం.. సౌదీ సార్వభౌమాధికారానికి ముప్పు వాటిల్లితే పాక్ సైన్యం అక్కడ రంగంలోకి దిగాల్సి ఉంటుంది. ప్రస్తుత హర్మూజ్ సంక్షోభం నేపథ్యంలో గల్ఫ్ దేశాలపై దాడులు పెరిగితే, సౌదీ చమురు క్షేత్రాలు, పవిత్ర నగరాల రక్షణ కోసం పాక్ దళాలను పంపాలంటూ రియాద్ నుంచి ఇస్లామాబాద్‌పై తీవ్ర ఒత్తిడి పెరుగుతోంది.

### ఇరాన్‌తో మధ్యవర్తిత్వమే ఏకైక మార్గమా?



సౌదీకి సైనిక సాయం అందిస్తే నేరుగా ఇరాన్‌తో శత్రుత్వాన్ని కొనితెచ్చుకున్నట్లు అవుతుందని పాకిస్థాన్ భయపడుతోంది. ఇప్పటికే సరిహద్దు వివాదాలు, ఉగ్రవాద ఆరోపణలతో ఇరాన్-పాక్ సరిహద్దులు అశాంతిగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో, ఇరాన్‌తో ఘర్షణ పడకుండా ఉండేందుకు ఇరుపక్షాల మధ్య మధ్యవర్తిత్వం వహించాలని పాక్ ప్రధాని భావిస్తున్నారు. టెహ్రాన్‌తో సంప్రదింపులు జరుపుతూ, హౌతీ దాడులను నియంత్రించేలా ఇరాన్ సుప్రీం లీడర్‌ను ఒప్పించేందుకు పాక్ దౌత్యవేత్తలు రంగంలోకి దిగారు.

### ఆర్థిక భయాలు.. పాక్‌కు తప్పని తిప్పలు

పాకిస్థాన్ ప్రస్తుతం ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాలు ఆర్థిక సంక్షోభం. ఒకవేళ హర్మూజ్ జలసంధిలో యుద్ధం ముదిరి, చమురు సరఫరా నిలిచిపోతే గల్ఫ్ దేశాల నుంచి వచ్చే నిధులు ఆగిపోతాయి. అలాగే చమురు ధరలు పెరిగితే పాక్ ఆర్థిక వ్యవస్థ పూర్తిగా దివాలా తీస్తుంది. అందుకే అటు గల్ఫ్ దేశాల రక్షణ బంధాన్ని తెంచుకోలేక, ఇటు ఇరాన్‌తో నేరుగా తలపడలేక పాకిస్థాన్ పిల్లిమొగ్గలు వేస్తోంది. పశ్చిమాసియా సంక్షోభంలో పాక్ తీసుకునే ఏ చిన్న నిర్ణయమైనా ఆ దేశ భవిష్యత్తును మార్చేసే అవకాశం ఉందని అంతర్జాతీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

# ఐఐఐటి బాసరలలో సీటు సాధించడం మేడిపల్లి పాఠశాలకు గర్వకారణం

ప్రథమ, ద్వితీయ ర్యాంకర్లకు ఘనంగా సన్మానించిన

పదవి విరమణ పొందిన ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు

**మేడిపల్లి, జూలై 17,నిజం న్యూస్ ప్రతినిధి :** మేడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎం. చందన పాఠశాల ప్రథమ ర్యాంకర్‌గా నిలిచి, ప్రతిష్ఠాత్మకమైన ఐ ఐఐటి బాసరలో సీటు సాధించి పాఠశాలకు గర్వకారణంగా నిలిచారు. పాఠశాల ద్వితీయ ర్యాంకర్ ఆయేషా సిద్దిఖ్ కూడా మంచి ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా పదవీ విరమణ పొందిన ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు విద్యార్థుల పట్ల తనకున్న మక్కువతో, విద్య పట్ల ఉన్న అభిరుచితో స్వచ్ఛందంగా ప్రథమ ర్యాంకర్ ఎం. చందన, ద్వితీయ ర్యాంకర్ ఆయేషా సిద్దిఖ్‌లను ఘనంగా సన్మానించారు. వారికి నగదు బహుమతులు, పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎల్. సత్య ప్రసాద్ మాట్లాడుతూ.. విద్యార్థుల విజయాలను గుర్తించి వారిని ప్రోత్సహించేందుకు శ్రీనివాసరావు చూపుతున్న చొరవను అభినందించారు. విద్యార్థుల పట్ల, విద్య పట్ల ఆయనకు ఉన్న ప్రత్యేకమైన అభిరుచికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులందరూ పాల్గొని విద్యార్థులను అభినందించారు.




# శివ చరణ్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీ నుండి తక్షణమే బహిష్కరించాలని కాంగ్రెస్ పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ని కలిసి మెమోరండం సమర్పించిన బేరి రామచందర్

ఈశ్వరమ్మ యాదవ్ కు క్షమాపణ చెప్పాలి.. బేరి రామచందర్ యాదవ్ డిమాండ్



**నిజం న్యూస్ శేరిలింగంపల్లి ప్రతినిధి, జూలై 17:** తెలంగాణా రాష్ట్ర యాదాద్రి శ్రీ లక్ష్మి నరసింహాస్వామి దేవస్థాన బోర్డు మెంబెర్ గా బీసీ వర్గం నుండి పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్ కీఒక చిన్న పదవి వచ్చిన కారణంగా అగ్ర వర్ణాలకు చెందిన నాయకులు అక్కసు తట్టుకోలేక ఆమెపై అనుచిత వ్యాఖ్యలు చేశారని ఈ వ్యాఖ్యలను వెంటనే ఖండించి శివచరణ్ రెడ్డి పార్టీ నుండి బహిష్కరించాలని ఈశ్వరమ్మ యాదవ్ కు క్షమాపణ చెప్పాలని బీసీ కుల సంఘాల ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు బేరి రామచందర్ యాదవ్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివచరణ్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర యాదవుల ఆత్మ గౌరవాన్ని కించపరిచేలా దుర్భషాలాడుతూ మాట్లాడిన ఆయన తీరుకు నిరసన తెలుపుతూ బేరి రామచందర్ యాదవ్ మిత్రబృందం కలిసి తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ కి వినతి పత్రం సమర్పించారు. బేరి తో పాటు తెలంగాణ రాష్ట్ర బీసీ కుల సంఘాల ఐక్యవేదిక మేదరి మహేంద్ర సంఘం మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా అధ్యక్షులు కొంటు ముకుందం , తెలంగాణ రాష్ట్ర బీసీ ఫెడరేషన్ అధ్యక్షులు ఆర్కే సాయన్న ముదిరాజ్, తెలంగాణ రాష్ట్ర బీసీ కుల సంఘాల ఐక్యవేదిక బీసీ ఫెడరేషన్ ముఖ్య సలహాదారు పట్లూరి కృష్ణమోహన్, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా బిసి కుల సంఘాల ఐక్యవేదిక అధ్యక్షులు రాజశేఖర్ యాదవ్, పులి రాజేందర్, నోముల ప్రవీణ్ కుమార్, బీసీ కుల సంఘాల ఐక్యవేదిక ఆర్గనైజింగ్ సెక్రటరీ హరికృష్ణ చారి, ఉప్పల్ అధ్యక్షులు ఎం.వి.ఎస్ నాయక్, అన్నా నగర్ అధ్యక్షులు శ్రీశైలం గౌడ్, బీ హెచ్ ఈ ఎల్ కీర్తి కుమార్, బిసి కుల సంఘాల ఐక్యవేదిక యువజన అధ్యక్షులు కొంటు సుమన్ , సిద్ధార్థ ముదిరాజ్, శీను పటేల్, అనేకమంది బీసీ నాయకులు కార్యకర్తలు దీని పై తెలంగాణా రాష్ట్ర ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి తక్షణమే స్పందించాలని, ఈ సంఘటనను ఖండించాలని, శివచరణ్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీ నుండి బరిష్కరించి, తక్షణమే బహిరంగ క్షేమాపణ చెప్పాల్సిందే అన్నారు. లేకపోతే తెలంగాణా రాష్ట్ర యాదవుల ఆగ్రహానికి గురి కావాల్సిందే అని ఖబర్దార్ అంటూ హెచ్చరించారు. మల్కాజ్ గిరి కాంటెస్ట్ ఎమ్మెల్యే మండలి రాధాకృష్ణ యాదవ్, రాయదుర్గం యాదవ సంఘం యూత్ ప్రెసిడెంట్ నాగపురి అశోక్ యాదవ్, వంగూరి సందీప్ యాదవ్, గౌడ సంఘం రాజు గౌడ్, కృష్ణ ముదిరాజ్, నాయి బ్రాహ్మణ సాయిలు, పద్మశాలి రమేష్, రజక సంఘం కిషోర్, జాతీయ భవన కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అనంతయ్య, తదితర యాదవ్, బీసీ నాయకులు పాల్గొన్నారు.




# వసంత్ నగర్ లో ఎస్ఐఆర్ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న సాయిబాబా చౌదరి


**నిజం న్యూస్ కూకట్పల్లి ప్రతినిధి, జూలై 17:** శుక్రవారం కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్, టీపీసీసీ ఉపాధ్యక్షులు, తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ ఆదేశాల మేరకు, కేపీహెచ్‌బీ వసంతనగర్ డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మందలపు సాయిబాబు చౌదరి ఆధ్వర్యంలో భారత ప్రభుత్వం చేపట్టిన ఎస్ఐఆర్ (ూ×=) కార్యక్రమంలో భాగంగా విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ కాలనీల్లో ఏర్పాటు చేసిన ఎస్ఐఆర్ హెల్ప్ డెస్క్‌లను బీఎల్‌వోలతో కలిసి సందర్శించి, ప్రజలకు ఎస్ఐఆర్ దరఖాస్తు ఫారాలను అందజేయడంతో పాటు వాటిని ఎలా పూరించాలో వివరించారు. ప్రజల సందేహాలను నివృత్తి చేస్తూ, అవసరమైన సూచనలు మరియు సలహాలను అందించారు. అలాగే రేపు శనివారం, ఎల్లుండి ఆదివారం సెలవు దినాలు కావడంతో ఎక్కువ మంది ప్రజలు అందుబాటులో ఉంటారని భావించి, ప్రతి కాలనీలోని కమ్యూనిటీ హాళ్ల వద్ద ఏర్పాటు చేసిన ఎస్ఐఆర్ హెల్ప్ డెస్క్‌లను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతి అర్హత కలిగిన ఓటరు తప్పనిసరిగా ఎస్ఐఆర్ ఫారాన్ని పూరించి సమర్పించి, తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మందలపు సాయిబాబు చౌదరి తో పాటు వసంతనగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కిలారి బాబు, కాలనీ వాసులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు కాజా నవీన్, రాము, రత్నాకర్ బాబు, భీమేశ్వర్ చౌదరి, శ్రీనివాస్, సుబ్రహ్మణ్యం, సురేష్, చిలుకూరి గోవిందరాజు తదితరులు పాల్గొన్నారు.




# యువ సంగ్రామ సదస్సుకు తరలిరండి..!

యువతకు పిలుపునిచ్చిన బీఆర్ఎస్ పార్టీ యూత్ విభాగం మాజీ అధ్యక్షుడు పైళ్ల ప్రభాకర్ రెడ్డి

**మేడిపల్లి, జూలై 17,నిజం న్యూస్ ప్రతినిధి :** సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే "యువ సంగ్రామ సదస్సు" కు యువత భారీ సంఖ్యలో తరలిరావాలని బీఆర్ఎస్ పార్టీ యూత్ విభాగం మాజీ అధ్యక్షుడు పైళ్ల ప్రభాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం యువతతో పాటు రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలను ఎన్నికల హామీల పేరుతో మోసం చేసిందని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమై ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందన్నారు. "యూత్ డిక్లరేషన్" పేరుతో నిరుద్యోగ భృతి, ప్రతి ఏడాది భారీ స్థాయిలో ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, ఉద్యోగ క్యాలెండర్, ఖాళీ పోస్టుల భర్తీ, ప్రైవేట్ రంగంలో ఉద్యోగ అవకాశాల కల్పన, నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు, స్టార్టప్‌లకు ప్రోత్సాహం, పోటీ పరీక్షలకు ఉచిత కోచింగ్ వంటి హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు సకాలంలో అందడం లేదని, నిరుద్యోగ యువత తీవ్ర నిరాశలో ఉందన్నారు. అదేవిధంగా రైతులకు ?2 లక్షల రుణమాఫీ, రైతు భరోసా, మహిళలకు నెలకు ?2,500 ఆర్థిక సాయం, మహాలక్ష్మి పథకం, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, గృహ జ్యోతి, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ డిక్లరేషన్‌లలో ఇచ్చిన హామీలు, చిరు వ్యాపారులు, ఆటో డ్రైవర్లు, కార్మికుల సంక్షేమానికి ప్రకటించిన పథకాల అమలులో కూడా ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. మహిళల నుంచి అన్నదాతల వరకు, విద్యార్థుల నుంచి నిరుద్యోగ యువత వరకు ఏ ఒక్క వర్గానికీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు పూర్తిస్థాయిలో అమలు కాలేదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి అనుసరిస్తున్న విధానాలు ప్రజా వ్యతిరేకంగా మారాయని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందన్నారు. జూలై 18న సరూర్‌నగర్‌లో జరిగే యువ సంగ్రామ సదస్సులో యువత భారీ ఎత్తున పాల్గొని ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని, ఎన్నికల హామీల అమలుపై ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. అలాగే యువజన సభకు అడ్డంకులు సృష్టించే ప్రయత్నాలు జరిగే అవకాశం ఉందని, అలాంటి ప్రయత్నాలను నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ఎదుర్కొని సభను విజయవంతం చేయాలని పైళ్ల ప్రభాకర్ రెడ్డి కోరారు.



# అన్యాయం జరిగిన కార్మికుడికి "మే" నెల రావాల్సిన వేతనం ఇప్పించిన-బిఆర్ టియు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి




**నిజం న్యూస్ కుత్బుల్లాపూర్ ప్రతినిధి, జూలై 17:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జీడిమెట్ల ఇండస్ట్రీ ఏరియాలోని ఓ కంపెనీలో సంజయ్ కుమార్ అనే కార్మికుడు గత కొన్ని సంవత్సరాల నుంచి పని చేసేవారు, కొన్ని అనివార్య కారణాలవల్ల కంపెనీ లో నుండి డ్యూటీ మానేయడం జరిగింది.. సంజయ్ కుమార్ కు కంపెనీ యజమాన్యం మే, నెల వేతనం రావాల్సి ఉండక అవి ఇవ్వకపోవడంతో యజమాన్యం అతన్ని పట్ల నిర్లక్ష్యం వహిస్తూ అతనికి వేతనం ఇవ్వకుండా మాయమాటలు చెప్పి అతని ఇబ్బంది పెట్టేవారూ, అడిగి అడిగి ఇబ్బంది చెందిన సంజయ్ కుమార్ అనే కార్మికుడు కి ఏం చేయాలో అర్థం కాక ఎవరైతే కార్మికులకు న్యాయం చేస్తారని తోటి కార్మిక మిత్రుల ద్వారా తెలుసుకొని, బిఆర్ టియు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి గురించి తెలుసుకొని తన కార్యాలయం వద్దకు వచ్చి తనకు జరిగిన అన్యాయం గురించి వివరించారు...వెంటనే స్పందించిన కార్మిక నాయకుడు రవి హుటాహుటిన జీడిమెట్ల ఇండస్ట్రీ లో ఉన్న కంపెనీ యజమాన్యం దగ్గరికి వెళ్లి కార్మికుడు సంజయ్ కుమార్ కి రావాల్సిన వేతనం ఇప్పించడం జరిగింది... కార్మికుడు సంజయ్ కుమార్ మాట్లాడుతూ నాకు మా కుటుంబానికి న్యాయం చేసిన కార్మికనాయకుడు రవి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు...ఈ కార్యక్రమంలో, సంతోష్ గౌడ్ సుదర్శన్, జగన్, మోజెష్, కిరణ్, పాల్గొన్నారు...

# UGD నిర్మాణ పనులను పరిశీలించిన మాజీ కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్





**నిజం న్యూస్ కూకట్పల్లి ప్రతినిధి, జూలై 17:** ఆల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ పరిధిలోని ఎన్టీఆర్ నగర్ కాలనీ లో నూతనంగా నిర్మిస్తున్న భూగర్భ డ్రైనేజీ లైన్ నిర్మాణ పనులను డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శేరిలింగంపల్లి శాసనసభ్యులు, పి.ఎ.సి చైర్మన్ అరేకపూడి గాంధీ సహకారంతో డివిజన్ లో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని అన్నారు. నూతనంగా నిర్మిస్తున్న డ్రైనేజీ లైన్ నిర్మాణ పనులను నాణ్యత ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు వినియోగంలోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ముజీబ్, రాజు, నాగరాజు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# మూసాపేట డిప్యూటీ కమిషనర్‌కు ఘన సన్మానం.. సేవలకు ప్రశంసల జల్లు!తెలంగాణ రాష్ట్ర ఓసి సంఘం ప్రధాన కార్యదర్శి వై. భాస్కర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కారం




**నిజం న్యూస్ కూకట్పల్లి ప్రతినిధి,జూలై 17:** మూసాపేట సర్కిల్ మున్సిపల్ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డిని తెలంగాణ రాష్ట్ర ఓసి సంఘం ప్రధాన కార్యదర్శి వై. భాస్కర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ప్రజలకు పారదర్శకంగా, బాధ్యతాయుతంగా సేవలందిస్తూ మున్సిపల్ పరిపాలనలో సమర్థవంతంగా విధులు నిర్వహిస్తున్నందుకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వై. భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు నిబద్ధతతో పనిచేస్తే ప్రభుత్వంపై ప్రజల విశ్వాసం మరింత పెరుగుతుందన్నారు. డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి ప్రజలకు అందుబాటులో ఉంటూ మున్సిపల్ సేవలను మెరుగుపరిచేందుకు చేస్తున్న కృషి అభినందనీయమని కొనియాడారు. డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజల సహకారంతో నగరాభివృద్ధికి కట్టుబడి పనిచేస్తున్నామని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు చేరేలా మరింత సమర్థవంతంగా సేవలందిస్తామని తెలిపారు. ఈ మర్యాదపూర్వక భేటీ ఆత్మీయ వాతావరణంలో సాగగా, పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో పలువురు ఓసి సంఘం నాయకులు, మున్సిపల్ అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ పై పూర్తి అవగాహనతో పని చేయాలి.. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు




**నిజం న్యూస్ శేరిలింగంపల్లి ప్రతినిధి, జూలై 17:** శుక్రవారం ఉదయం 10.00 గంటలకు శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని గచ్చిబౌలి డివిజన్ రాయదుర్గంలో ఉన్న ఎంఎస్ కన్వెన్షన్ హాల్‌లో శేరిలింగంపల్లి సీనియర్ నాయకులు, గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా ఆధ్వర్యంలో ఎస్ఐఆర్ (ూ×=) అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కూకట్‌పల్లి శాసనసభ్యులు మాధవరం కృష్ణారావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రతి బీఎల్‌ఏ పూర్తి అవగాహనతో పనిచేయాలని, ఓటర్ల వివరాల పరిశీలనలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఇవ్వకుండా పార్టీ శ్రేణులంతా సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. ప్రజల హక్కులను పరిరక్షించడంలో ప్రతి కార్యకర్త కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఇప్పటి నుంచే క్షేత్రస్థాయిలో బలోపేతంగా పనిచేయాలని, ప్రజల ఆశీర్వాదంతో మరోసారి గులాబీ జెండా శేరిలింగంపల్లి నియోజకవర్గంలో రెపరెపలాడడం ఖాయమని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రంగారావు, బీఆర్ఎస్ పార్టీ బీఎల్‌ఏలు, మాజీ డివిజన్ అధ్యక్షులు, మాజీ వార్డు సభ్యులు, మాజీ ఏరియా కమిటీ సభ్యులు, సీనియర్ నాయకులు, పార్టీ కార్యకర్తలు, మహిళా నాయకురాళ్లు తదితరులు పాల్గొన్నారు.

# 800 మంది లబ్ధిదారులకు న్యాయం జరిగేదాకా పోరాడుతా: బండి రమేష్






**నిజం న్యూస్ కూకట్పల్లి ప్రతినిధి, జూలై 17:** దశాబ్దాలుగా పరిష్కారం దొరకని భూదాన్ ల్యాండ్ సమస్యకు సహాయం చేసి 800 మంది లబ్ధిదారులకు న్యాయం చేయాలని బాధితులు పీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్ ని కలిసి అభ్యర్థించారు. శుక్రవారం మూసాపేట ఆంజనేయ నగర్ లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి వచ్చిన బాధితులు, పలువురు స్థానిక రాజకీయ నాయకులు ఐడిపియల్ ఉద్యోగుల అండతో సుమారు 17 ఎకరాల భూదాన్ భూమిని కబ్జా చేసి హక్కుదారులను బెదిరిస్తున్నారని, హైకోర్టు క్లియర్ డైరెషన్స్ ఉన్నప్పటికీ అధికారులు కూడా ఒత్తిళ్లకు లొంగి సమస్యపై దృష్టి పెట్టడం లేదని వాపోయారు.మీరు కల్పించుకొని న్యాయం చేయాలి రమేష్ కి విజ్ఞప్తి చేసి, వినతిపత్రం అందచేశారు. బాధితుల సమస్య పూర్వాపరాలు తెలుసుకున్న బండి రమేష్ , వెంటనే సంబంధిత అధికారులకు ఫోన్ చేసి సమస్య తక్షణం పరిష్కరించేందుకు చొరవచూపాలని కోరారు. ఈ విషయంలో సంబంధిత అధికారులు ఎలాంటి అక్రమాలకు, ఒత్తిడులకు లొంగినా పై అధికారులకు పిర్యాదు చేస్తానని, బాధితులకు న్యాయం జరిగేదాకా వారి పక్షాన నిలబడతానని బండి రమేష్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గొట్టుముక్కల వెంకటేశ్వరరావు,ఖలీమ్ ఖాన్,ఫాల్గుణ రావు, చంద్రావు,వాసు, నారాయణ,ఆంజనేయులు,రఘువీర్,మల్లికార్జున్,వాణి, కనకమ్మ వజ్రం , భూదాన్ ల్యాండ్ లబ్ధిదారులు పాల్గొన్నారు.


# ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం... బస్తీ దావకానాలు ప్రజలకు వరం: వి జగదీశ్వర్ గౌడ్



**నిజం న్యూస్ శేరిలింగంపల్లి ప్రతినిధి, జూలై 17:** ప్రజల ఆరోగ్యమే మహాభాగ్యం అనే లక్ష్యంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య రంగంలో పలు వినూత్న కార్యక్రమాలను అమలు చేస్తోందని,అందులో బస్తీ దవాఖానాలు అత్యంత ప్రజాదరణ పొందిన కార్యక్రమాల్లో ఒకటిని అన్నారు టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి,శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి జగదీశ్వర్ గౌడ్ శుక్రవారం మదీనాగూడ డివిజన్ పరిధిలోని గంగారం గ్రామంలోని బస్తీ దవాఖానాను స్థానిక నాయకులు,ప్రజలతో కలిసి పరిశీలించారు..


**ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ:** పట్టణ ప్రాంతాల్లోని పేద,మధ్యతరగతి ప్రజలకు వారి నివాస ప్రాంతాలకు సమీపంలోనే నాణ్యమైన ప్రాథమిక వైద్య సేవలను పూర్తిగా ఉచితంగా అందించడం ప్రభుత్వం ప్రధాన ఉద్దేశ్యం అని,ప్రతి పౌరుడికి నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించడం ప్రభుత్వ బాధ్యతగా ముందుకు సాగుతున్నామని,ఆ లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం బస్తీ దవాఖానాల ద్వారా ప్రజలకు వారి ఇంటి వద్దకే ఉచిత వైద్య సేవలను అందిస్తూ ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి కృషి చేస్తోందని,ప్రజల ఆరోగ్యమే రాష్ట్ర అభివృద్ధికి బలమైన పునాది." అని అన్నారు.. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు,నాయకులు తదితరులు పాల్గొన్నారు..

## పుస్తక సమీక్ష ఎ మానవత్వం జీవకారుణ్యం




ఆర్.సి.కృష్ణస్వామిరాజు కథలు మానవత్వపు పరిమళాలను వెదజల్లుతాయి. 21 కథలతో తాజాగా వెలువరించిన కథా సంపుటి 'జక్కదొన' కూడా అలాంటిదే. 'జక్కదొన' గొర్రెల కాపర్ల జీవితంతో ముడిపడింది. ప్రాణాలంటే మనుషులవి మాత్రమే కాదు.. మూగజీవాలవి కూడా అని ఈ కథ చాటుతుంది. ఎర్రమట్టి, పొట్టిగుట్టలు కథలు కూడా జీవకారుణ్యం ప్రధానంగా సాగుతాయి. మనిషి ఏ రంగంలో రాణించాలన్నా విద్యావంతుడై ఉండాలి. 'బుడబుక్కల బంగారుతల్లి', 'ఫుల్‌మీల్స్', 'గోల్కొండ చూసొద్దాం, రారండి!!' కథలు మనిషి ఎదగడానికి చదువు ఎంతో అవసరమనే విషయాన్ని వెల్లడిస్తాయి. మంచిపని కోసం ఒక్కరు ఒక్క అడుగు ముందుకు వేస్తే సమాజం వారి వెన్నంటి నిలుస్తుందని 'రైట్%ా% రైట్', 'నగరి ముక్కు', 'తొలి అడుగు' కథలు తేటతెల్లం చేస్తాయి. 'డిపాజిట్', '%ూ% బోర్డు' కథల్లో నాయికలు స్త్రీలు అన్ని రంగాల్లో రాణించగలరని స్ఫూర్తినిస్తారు. 'డబ్బు పాపిష్టిది' కథలో అత్యాధునిక వసతులతో హాస్పిటల్ కట్టి అప్పులపాలై ప్రాణాల మీదికి తెచ్చుకున్న వైద్యుడి జీవితాన్ని ఆర్ద్రంగా ఆవిష్కరించారు. ఇది ధనవంతుల జీవితాల్లో రెండో పార్శ్వాన్ని కండ్లకు కడుతుంది.'అంజేరమ్మ కనుమ' బైక్‌లు నడిపేవాళ్లు హెల్మెట్ తప్పకుండా ధరించాలనే సందేశాన్ని ఇస్తుంది. 'జక్కదొన' కథల నేపథ్యం చాలావరకు తిరుపతి, పుత్తూరు పరిసర ప్రాంతాలే అయినప్పటికీ, ఇవి అన్ని ప్రాంతాల వారికీ దయ, కరుణ, ప్రేమ, జీవితంపట్ల, సమాజంపట్ల బాధ్యతల ఆవశ్యకతను తెలియజేస్తాయి.

## స్మార్ట్‌ఫోన్‌తో.. క్లిక్! క్లిక్! క్లిక్!



ఒక దశాబ్ద కాలం కిందివరకూ.. మనం ఏ టూర్‌కి వెళ్లినా ఓ చిన్న కెమెరాను వెంట తీసుకెళ్లేవాళ్లం. అది డిజిటల్ కెమెరా లేదంటే, రీల్ కెమెరానో అయి ఉండేది. ఇంటికి వెళ్లాక వాటి మెమరీ కార్డ్స్‌లోంచి కంప్యూటర్‌లోకి ట్రాన్స్‌ఫర్ చేసుకుని.. వాటిని ప్రింట్ చేయించుకునే వాళ్లం. అలా.. ఆ టూర్‌కు సంబంధించిన అందాలను, అనుభూతులను భద్రపర్చుకునేవాళ్లం. కానీ, స్మార్ట్‌ఫోన్‌ల రాకతో పరిస్థితి మారిపోయింది. ఇప్పుడొస్తున్న ప్రతి స్మార్ట్‌ఫోన్‌లో.. మంచిమంచి కెమెరాలు ఉంటున్నాయి. దీనివల్ల మనకి వేరేగా కెమెరా వెంట పెట్టుకెళ్లే అవసరం లేకుండాపోయింది. చేతిలో ఒక మంచి స్మార్ట్‌ఫోన్ ఉంటే చాలు.. మనకి నచ్చినట్టు ఫొటోలు తీయొచ్చు. దాంతో ఇప్పుడు చాలామంది ఫొటోగ్రఫీని ఒక హాబీగానూ ఎంచుకుంటున్నారు. అయితే, ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్‌లా ఫొటోలు తీయాలంటే.. కొన్ని టిప్స్ పాటించడం అవసరం. మరి ఇంకా లేట్ చేయకుండా ఆ టిప్స్ ఏంటో నేర్చేసుకుందాం.

1. లైటింగ్: ఫొటోలో 'లైటింగ్' కీలకపాత్ర పోషిస్తుంది. సాధ్యమైనంత వరకు సహజ కాంతిలోనే ఫొటోలు తీసేందుకు ప్రయత్నించండి. సూర్యోదయం లేదా సూర్యాస్తమయం సమయంలో తీసిన ఫొటోలు.. అందమైన నారింజ రంగులో అదిరిపోతాయి.

2.ఫోకస్: మొబైల్ కెమెరాతో ఫొటో తీసేటప్పుడు.. ఫోకస్‌ను సరిగ్గా సెట్ చేయడం చాలా ముఖ్యం. మీ సబ్జెక్ట్ (దేన్నయితే ఫొటో తీస్తున్నారో)పై టచ్‌చేస్తే.. ఆటోమేటిక్‌గా ఫోకస్ అయిపోతుంది. ఇది ఫొటోను స్పష్టంగా వచ్చేలా సహాయపడుతుంది.

3.స్టెబిలిటీ : మీరు ఫొటో తీసేటప్పుడు మీ స్మార్ట్‌ఫోన్ కదలకుండా ఉండాలి. లేకుంటే, ఫొటోలు షేక్/బ్లర్ అవుతాయి. ఇందుకోసం ఫోన్‌ను రెండు చేతులతో గట్టిగా పట్టుకుని ఫొటో తీయండి. అవసరమైతే ట్రైపాడ్‌ను వాడండి.

4.క్లియర్‌గా: మీ ఫొటోల్లో ప్రధాన సబ్జెక్ట్ స్పష్టంగా ఉండేలా చూసుకోండి. ఫ్రేమ్‌లో అనవసరమైన వ్యక్తులు, ప్రదేశాలు ఏవైనా ఉంటే.. అలాంటి డిస్టర్బెన్స్‌లను తొలగించండి.

5.అవసరమైతేనే.. ఫ్లాష్ : ఫ్లాష్ ఎప్పుడూ ఆన్‌లోనే ఉండాల్సిన అవసరంలేదు. ఫ్లాష్‌ను అనవసరంగా ఉపయోగిస్తే.. ఫొటోలు మెరుస్తున్నట్లు కనిపిస్తాయి. సాధ్యమైనంత వరకూ సహజసిద్ధమైన, పరిసరాల కాంతిపైనే ఆధారపడి ఫొటోలు తీయండి. అంతగా లైటింగ్ అవసరం అనుకుంటే.. సాఫ్ట్ గ్లో కోసం సెకండరీ లైట్ సోర్స్‌ని ఉపయోగించండి.

6.దగ్గరగా వెళ్లండి: స్మార్ట్‌ఫోన్ కెమెరాలు పట్టుకొని డిజిటల్ జూమ్ చేస్తే.. ఫొటోలో నాణ్యత తగ్గుతుంది. అందుకే.. జూమ్ చేయడానికి బదులుగా సబ్జెక్ట్‌కు దగ్గరగా వెళ్లి ఫొటోలు తీసేందుకు ప్రయత్నించండి.

7.మోడ్: హై డైనమిక్ రేంజ్ మోడ్.. మీ ఫొటోలను మరో మెట్టు ఎక్కిస్తుంది. మామూలుగా ఫొటో తీస్తే.. ఎండ ప్రదేశాలు ఎక్కువ ప్రకాశవంతంగా, నీడలో ఉండేవి చీకటిగా కనిపిస్తాయి. ఈ సమస్యకు.. %ఎణ=% మోడ్ పరిష్కారం చూపుతుంది. ప్రకృతి దృశ్యాలు, అధిక కాంట్రాస్ట్ ఉండే దృశ్యాల కోసం దీన్ని ఉపయోగించండి.

8.స్టోరీ చెప్పండి: మీరు తీసే ఒక్కో ఫొటో.. ఒక్కో కథ చెబుతుందని గుర్తించి.. ఫొటోలు తీసుకోండి. మీరు చెప్పాలనుకుంటున్న కథనం.. ఆ ఫొటోల్లో ప్రతిబింబించేలా చూసుకోండి. ఆ పరిసరాలు.. అక్కడి భావోద్వేగాలు, మానసిక స్థితిని చెప్పేలా మీ షాట్‌ను కంపోజ్ చేయండి. అప్పుడు మీ ఫొటోలు.. మరింత ఆసక్తికరంగా కనిపిస్తాయి.

9.ప్రాక్టీస్‌తో పర్‌ఫెక్ట్: ఫొటోలు మరింత పర్‌ఫెక్ట్‌గా రావాలంటే.. మరిన్ని ఎక్కువగా ఫొటోలు తీయండి. ఫోన్‌ను చేతపట్టుకొని రోజూ ప్రాక్టీస్ చేస్తుండండి. వివిధ యాంగిల్స్, లైటింగ్ షేడ్స్‌ను ట్రై చేస్తూ.. మీ స్కిల్స్ మెరుగుపర్చుకోండి. మొదట్లో ఈ టిప్స్ పాటించడం కొంచెం కష్టంగా అనిపించినప్పటికీ, కొద్దికాలానికి అలవాటు అవుతాయి. మీ క్రియేటివిటీకి అనుగుణంగా ఈ టిప్స్‌ను కలిపి కొత్త తరహా ఫొటోలు సృష్టించండి! మీ స్మార్ట్‌ఫోన్స్‌తో మంచి ఫొటోలు తీసుకోవడానికి.. ఈ చిట్కాలు మీకు సహాయపడతాయని ఆశిస్తూ..

ఎడిటింగ్

ఎడిటింగ్‌తో ఫొటోలు మరింత ఆకర్షణీయంగా కనిపిస్తాయి. ఫొటోలు తీసిన తర్వాత.. ఎడిటింగ్ టూల్స్ ఉపయోగించి లైటింగ్, కాంట్రాస్ట్‌తోపాటు రంగులను మెరుగుపరచండి. ఇందుకోసం వంటి యాప్‌లు వాడండి. ఆడెపు హరికృష్ణ.

### భూ కేంద్రంలో మరో పొర


## ఆ రహస్య నిర్మాణం ఏమై ఉంటుంది?

**ఆధారాలు దొరికాయన్న ఆస్ట్రేలియా సైంటిస్టులు**



భూమి అనేక పొరలతో కూడిన అంతుబట్టని అద్భుత నిర్మాణం. అత్యంత సంక్లిష్టమైన ఈ నిర్మాణాన్ని సైంటిస్టులు ప్రధానంగా నాలుగు (క్రస్ట్, మాంటెల్, ఔటర్ కోర్, ఇన్నర్ కోర్) పొరలుగా విడగొట్టారు. నాలుగు కాదు..ఐదో పొర కూడా ఉందని గత కొంత కాలంగా ఆస్ట్రేలియన్ నేషనల్ యూనివర్సిటీ సైంటిస్టులు చెబుతున్నారు. అయితే ఇందుకు సంబంధించి శాస్త్రీయ ఆధారాలు లభ్యమయ్యాయని వారి పరిశోధన పేర్కొన్నది. 'జర్నల్ ఆఫ్ జియోగ్రఫికల్ రీసెర్చ్' ప్రచురితమైన కథనం ప్రకారం, భూమి పొరల్లో కేంద్ర భాగమైన 'ఇన్నర్ కోర్'లో అదనంగా మరో పొర ఉందని శాస్త్రవేత్తల పరిశోధన చెబుతున్నది. ఇన్నర్ కోర్ లోతుల్లో ఉన్న మరో పొర ఇనుము-నికెల్ లోహ మిశ్రమంతో కూడి ఉందని గుర్తించారు. భూకంపం సంభవించాక.. శక్తి తరంగాలు, భూకంప తరంగాలు భూమిలో ఎలా ప్రయాణిస్తున్నాయన్న దానిపై సైంటిస్టులు అధ్యయనం చేస్తున్నారు. ఈ తరంగాలు వేర్వేరు దిశల్లో వేర్వేరు వేగాలతో పయనిస్తున్న సంగతిని గుర్తించారు. అంతర్గత కేంద్రం (కోర్)లో ఒకటికి బదులు రెండు పొరలు ఉండటం వల్లే ఇది సాధ్యమవుతుందని సైంటిస్టులు చెబుతున్నారు. మానవులు సహా జంతు జీవ జాలమంతా నివసిస్తున్న బయట పొరను 'క్రస్ట్'గా పిలుస్తారు. దీని కింద ఉన్నది 'మాంటిల్'. ఇక భూమి కేంద్ర భాగాన్ని 'కోర్'గా పేర్కొన్నారు. దీనిని ఇన్నర్, ఔటర్..అనే రెండు భాగాలుగా విడగొట్టారు. భూ అయస్కాంత శక్తి ఇక్కడి నుంచే ఉత్పత్తి అవుతున్నది.


# కళకు పెట్టిన..కోటగోడ



తెలంగాణ, దక్కన్ కళారంగానికి విశేష సేవలు అందించిన జగదీశ్ మిట్టల్ జనవరి 7న తన వందో ఏట హైదరాబాద్‌లో కన్నుమూశారు. ఉత్తరప్రదేశ్‌లోని బులంద్‌షహర్‌కు చెందిన ఆయన 1925, సెప్టెంబర్ 16న ఉత్తరాఖండ్‌లోని ముస్సోరీలో జన్మించారు. 1950లలో హైదరాబాద్ వచ్చి స్థిరపడ్డారు. పదో ఏట ప్రారంభమైన కళారూపాల సేకరణ దాదాపు 9 దశాబ్దాలపాటు అంటే ఆయన తుదిశ్వాస విడిచే వరకు కొనసాగింది. తెలంగాణ కళారూపాలకు ఆయన అంతర్జాతీయంగా గుర్తింపు తెచ్చిపెట్టారు. రాయల్ కోర్ట్ పెయింటింగ్‌లు, స్కెచ్‌లు మొదలుకొని తెలంగాణ స్క్రోల్ పెయింటింగ్ (కుల పురాణాల చిత్ర పటాలు), చేర్యాల నకాషా చిత్రాలు, బిద్రీ కళాఖండాలు, కరీంనగర్ ఫిలిగ్రీ, చేనేత డిజైన్స్‌తో పాటు బహమనీ, కుతుబ్ షాహీ, అసఫ్‌జాహీ కాలపు పెయింటింగ్‌లు, ఇత్తడి, రాగి, కంచు, వెండి, బంగారు, కళాఖండాలు, చారిత్రక ప్రాధాన్యం గల వస్తువులను దాదాపు 3 వేల వరకు సేకరించి మ్యూజియం ఏర్పాటుచేశారు. కళారంగానికి ఆయన చేసిన సేవలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం 1990లో 'పద్మశ్రీ' పురస్కారంతో గౌరవించింది. మిట్టల్ 1960, 70లలో చేర్యాల కళాకారులను గుర్తించి ప్రోత్సహించారు. ఇక్కడి చేనేత కళాకారుల డిజైన్, పెంబర్తి కళలను గుర్తించి ప్రచారం చేశారు. స్క్రోల్ పెయింటింగ్స్ గొప్పతనాన్ని, ప్రాముఖ్యాన్ని వివరిస్తూ అంతర్జాతీయ ప్రమాణాలతో ఇంగ్లిష్ లో అనే ప్రామాణిక గ్రంథాన్ని రాసి ప్రచురించారు. 'దక్కన్ పెయిటింగ్'తో పాటు పలు ఇతర పుస్తకాలు రాశారు. 1954లో 'భారతీయ కసిదా' అనే పుస్తకాన్ని సహ రచయితగా చేశారు. జగదీశ్ మిట్టల్ సేకరణలో చేరియాల్ స్క్రోల్ పెయింటింగ్ గురించి గొప్పగా చెప్తారు. మూడడుగుల వెడల్పు, 30 అడుగుల పొడవైన స్క్రోల్ పెయింటింగ్ అయిన ఇది 1625 నాటిది. దీనిపై మార్కండేయ ముని, భావన రుషి చిత్రాలు నకాషీలుగా చెక్కి ఉన్నాయి. దీనిని ఆయన కునపులి వారి వద్ద కేవలం రూ. 500కు కొనుగోలు చేశారు. దీని వెనక కూడా ఓ కథ ఉన్నది. ఈ పాతబడిన స్క్రోల్ పెయింటింగ్‌ను వారు జల విసర్జన చేయాలని అనుకుంటున్న వేళ వారికి రూ. 500 ఇచ్చి మిట్టల్ దానిని కొనుగోలు చేశారు. ఇప్పుడు దీని ఖరీదు కోట్లలో ఉంటుంది. అలాగే, ప్రముఖ పహాడీ చిత్రకారుల్లో ఒకరైన నైన్సుఖ్ నుంచి ఆరు పెయిటింగ్‌లను కొనుగోలు చేశారు. మిట్టల్ తన భార్య కమలతో కలిసి దేశంలోని వివిధ పత్రికలు, మ్యాగజైన్లకు భారతీయ కళలోని వివిధ అంశాలపై ఎన్నో వ్యాసాలు రాశారు. భారతీయ కళ, వారసత్వ పరిరక్షణ, ప్రోత్సాహానికి వీరు చేసిన కృషి అమోఘం. ఇండియన్ నేషనల్ ట్రస్ట్ ఫర్ ఆర్ట్ అండ్ కల్చరల్ హెరిటేజ్ వ్యవస్థాపక సభ్యుడైన మిట్టల్ దేశంలోని పలు మ్యూజియంలు, వర్సిటీలు, న్యూయార్క్‌లోని మెట్రోపాలిటన్ మ్యూజియంలో భారతీయ కళలు, పెయిటింగ్‌లు, హస్తకళలు, జానపద కళారూపాలపై ఎన్నో ఉపన్యాసాలు ఇచ్చారు. లండన్, లాస్ ఏంజెలెస్, చికాగో తదితర నగరాల్లో కళపై ఉపన్యాసాలు ఇచ్చారు. అగర్వాల్ సమాజ్ కళారత్న పురస్కారం, సనాతనధర్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారం, యుధ్వీర్ అవార్డు, ఏపీ ప్రభుత్వం నుంచి 2006లో జీవితకాల సాఫల్య పురస్కారం అందుకున్నారు. అలాగే, ఇండియన్ నేషనల్ ట్రస్ట్ ఫర్ ఆర్ట్స్ కల్చరల్ హెరిటేజ్ (ఇంటాచ్) వ్యవస్థాపక సభ్యుడిగా, తంజావూరులోని సౌత్‌జోన్ కల్చరల్ సెంటర్ పాలక మండలి సభ్యుడిగానూ పనిచేశారు. మిట్టల్ మ్యూజియంలో 50 శాతం వరకు మినియేచర్ పెయింటింగ్స్, డ్రాయింగ్‌లు ఉన్నాయి. మ్యానుస్క్రిప్ట్‌లు, ఇస్లామిక్ కాలిగ్రఫీ, జానపద, సంప్రదాయ కంచు విగ్రహాలు, బొమ్మలు, టెర్రకోట వస్తువులు, దారు శిల్పాలు. దంతపు బొమ్మలు, గాజు వస్తువులు వంటి కళాత్మక చిత్రాలు ఉన్నాయి. అలాగే, క్రీ.పూ. ఒకటో శతాబ్ది నాటి ప్రాచీన కళారూపాలు మొదలుకొని మొఘల్, దక్కన్ పెయింటింగ్స్ వరకు ఉన్నాయి. 2015లో న్యూయార్క్‌లోని మెట్రో పాలిటన్ మ్యూజియం ఆఫ్ ఆర్ట్ సుల్తాన్స్ ఆఫ్ దెక్కన్ ఇండియా, 1500-1700 వెల్త్ అండ్ ఫాంటసీ పేరుతో ఏర్పాటుచేసిన ప్రదర్శనలో మిట్టల్ కళాఖండాలు ప్రదర్శించారు. మిట్టల్-కమల దంపతులు భారత్‌కే కాదు, ప్రపంచం నలుమూలల ఉన్న ప్రముఖ ఆర్ట్ కలెక్టర్లు, చరిత్ర పరిశోధకులకు సుపరిచితమే. అమెరికా మాజీ అధ్యక్షుడు జాన్ ఎఫ్ కెన్నడీ సతీమణి జాక్వెలిన్ కెన్నడీ, ప్రముఖ చరిత్రకారుడు డాల్రింపుల్ వంటి వారు హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని మిట్టల్ ఇంటిని సందర్శించారు. మిట్టల్ దంపతులు వుడ్ కట్, ఎంబ్రాయిడరీలో కూడా కృషిచేశారు. కనుమరుగవుతున్న బాతిక్ కళకు సహకారమందించారు. వీరి చిత్రాలు సాలార్జంగ్ మ్యూజియం హైదరాబాద్, వారణాసిలోని భరత్ కళాభవన్, న్యూఢిల్లీలోని నేషనల్ గ్యాలరీ ఆఫ్ మోడరన్ ఆర్ట్‌తో సహా వివిధ మ్యూజియంలలో కనిపిస్తాయి. కళల పట్ల ఉన్న ప్రేమతో మిట్టల్ తన ఇంటినే మ్యూజియంగా మార్చేశారు. ప్రస్తుతం దీనిని ఆయన మనుమడు, మనుమరాలు చూసుకుంటున్నారు. ఇతర మ్యూజియంల మాదిరిగా కాకుండా, దీన్ని సందర్శించడానికి ప్రత్యేక పద్ధతి ఉన్నది. ముందే అపాయింట్‌మెంట్ తీసుకోవాల్సి ఉంటుంది. సందర్శకులకు వారి సేకరణ మొత్తం చూపరు. నిర్ణీత రోజున వారికి ఆసక్తిగల వాటినే అందుబాటులో ఉంచుతారు. ప్రతి కళాఖండానికి మిట్టల్ వ్యాఖ్యానం ఉంటుంది. వాటిలో ప్రతి ఒక్క కళాఖండానికి ఒక కథ ఉంటుంది. ఇండియన్ పెయింటింగ్, టెక్స్‌టైల్స్ స్టడీస్ అంశంపై 2025 జనవరి 9 నుంచి 11 వరకు 3 రోజుల అంతర్జాతీయ సెమినార్ నిర్వహించడానికి సన్నాహాలు చేస్తూనే మిట్టల్ మరణించారు. అంతకు 13 ఏండ్ల ముందే ఆయన భార్య కమల మృతి చెందారు. తెలంగాణ, దక్కన్ కళలు, సంస్కృతి, వారసత్వాన్ని రక్షించడానికి, ప్రోత్సహించడానికి జగదీశ్ మిట్టల్ చేసిన కృషి అనన్య సామాన్యం. మిట్టల్-కమల దంపతులు భారత్‌కే కాదు, ప్రపంచం నలుమూలల ఉన్న ప్రముఖ ఆర్ట్ కలెక్టర్లు, చరిత్ర పరిశోధకులకు సుపరిచితమే. అమెరికా మాజీ అధ్యక్షుడు జాన్ ఎఫ్ కెన్నడీ సతీమణి జాక్వెలిన్ కెన్నడీ, ప్రముఖ చరిత్రకారుడు డాల్రింపుల్ వంటి వారు హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని మిట్టల్ ఇంటిని సందర్శించారు.


## స్త్రీ అస్తిత్వ పోరాట దర్పణం

కొత్త ఏడాదిలోకి అడుగిడగానే చేతిలోకి తీసుకున్న ఒక కమ్మని కథలహారం డాక్టర్ వాణీ దేవులపల్లి 'నుమాయిష్.. మరికొన్ని కథలు'. నా లోని చదువరికి ఒక కొత్త ఉత్సాహాన్ని కలిగించింది. ఇందుకు 'నుమాయిష్' అనే ఉర్దూ పద ప్రయోగం ఒక కారణమైతే, ఆకర్షణీయమైన ముఖ'చిత్రం' మరో కారణం కావచ్చు. గురువర్యులు గిరిజా మనోహర్, కాత్యాయినీ రాసిన సమీక్షలు, రచయిత్రి వాణి ముందుమాటతో సమకాలీన సమాజానికి అద్దంపట్టిన 14 కథలతో కూడిన ఈ పుస్తకం ప్రతి పాఠకుడి మస్తిష్కానికి పదును పెడుతుంది. కథలను నా దృష్టికోణం నుంచి ఒక్కొక్కటిగా ఆస్వాదించాలనుకొని, కథను చదవడం, ఓ పేజీ తిరగేసి మరో పేజీలోకి దూరే లోపలే ఆ కథకు అతుక్కుపోవడం, ఆ కథ అయిపోయాకే తేరుకోవడం జరిగిందంటే ఆ కథల్లో కథనం, కథాబలం ఎంత మెండుగా వున్నాయో అర్థం చేసుకోవచ్చు. మొట్టమొదటి కథా సంకలనంతోనే గొప్ప రచనా శైలిని ప్రదర్శించి, వైవిధ్యమైన కథా వస్తువులను ఎన్నుకున్నారు వాణీ దేవులపల్లి. భిన్న నేపథ్యాలతో ఈ పుస్తకంలో ఉన్న 14 కథల్లో తెలంగాణ అస్తిత్వం, మధ్య తరగతి స్త్రీ అస్తిత్వ పోరాటం చాలా ప్రస్ఫుటంగా గోచరిస్తాయి. ఏ కథలోకి దిగినా అందులో పచ్చని పల్లెల నేపథ్యం, మన జీవితంలోకి మనమే తొంగి చూసుకున్న భావం తప్పకుండా కలుగుతుంది. మొట్టమొదటి కథ 'గురవయ్య సారు కానిగీ బడి' అమాంతం 50 ఏళ్ల కిందటి నా బాల్యాన్ని మోసుకొచ్చి ముందుంచిందంటే అతిశయోక్తి కానే కాదు. కథ ముగింపులోపు పాఠకుడు కన్నీరుకార్చక ఉండలేని కథ. ఒక స్త్రీపై మగవాడికుండే అపోహ, సొంత అక్క అనుబంధాన్ని కూడా అర్థంచేసుకోలేని ఒక తమ్ముడి మూర?త్వం, ఆడబిడ్డ ఆప్యాయత, అనురాగాలని జమా ఖర్చులతో బేరీజు వేసుకున్న ఆ తమ్ముడికి ఆప్యాయత, అనురాగాలంటే ఇవీ అని చూపిన అక్క ప్రేమ. ఇలా అక్క, భార్య తమ నిష్కల్మషమైన ప్రేమతో గోపాల్‌కి జ్ఞానోదయం కలిగించే రాగబంధాలు కథ ఆద్యంతం ఆసక్తికరం. 'తప్యాలచెక్క' కేవలం ఒక కథ కాదు, ఒక అబల వ్యధ. అలాగే, 'పనిమనిషి' మన మనసులను కదిలించే మరో కథ. ఇక 'నుమాయిష్'కథ కట్టి పడేస్తుంది. స్వచ్ఛమైన ప్రేమకు దర్పణంగా నిలిచే చిన్న కథ ఇది. ఈ




కథా సంపుటికి నుమాయిష్ మరికొన్ని కథలు అని పేరు పెట్టడంలో ఎంతో ఔచిత్యం వుందనిపించింది. ఇందులోని ప్రతి కథా మధ్య తరగతి జీవితాల్లోని వాస్తవిక సన్నివేశాలకు ప్రతిబింబం లాంటిది. మహిళల జీవితం బయటకు అందంగా కనపడే 'నుమాయిష్' కాదని ప్రతినిత్యం ఒక సంఘర్షణ అని, ఒక త్యాగమని, ఒక సాహసమని తెలిపే వాస్తవ చిత్రాల సమాహారం ఈ పుస్తకం. దాదాపు అన్ని కథల్లో ప్రత్యేకంగా కనబడేది రచయిత్రి ఎంచుకున్న శైలి. ఏ కథకు, ఏ భావానికి ఏ రకమైన భాషను వాడి పాఠకులను మెప్పించాలో వాణికి బాగా తెలుసు. ఇవి మనం చదవాల్సిందే, చైతన్యం పొందాల్సిందే.

# గానలోలుని గీతమాల




తెలుగు సినిమా పాటల సంకలనాల విషయానికి వస్తే, ప్రధానంగా, అగ్రశ్రేణి హీరో హీరోయిన్లకు సంబంధించిన హిట్ సాంగ్స్ లేదా ఘంటసాల, సుశీల, జానకి, బాలు మొదలగు ప్రసిద్ధ గాయకులకు చెందినవి లేదా గీత రచయితలు, సంగీత దర్శకుల పాటలను సంకలనం చేస్తుండటం పరిపాటి. అలాంటి సంకలనాలలో పాటల వివరాలు చాలావరకు తప్పుల తడకలనే చెప్పాలి. దీనికి భిన్నంగా అలనాటి 'శ్రీకృష్ణ లీలలు' (1935) సినిమా మొదలుకొని 2013లో వచ్చిన ఆది శంకరాచార్య చిత్రం వరకు, అనగా 80 ఏండ్ల కాలంలో వచ్చిన తెలుగు సినిమాలలోని శ్రీకృష్ణునికి సంబంధించిన పాటలను అతి వ్యయప్రయాసలకోర్చి సేకరించి, 'బృందావనమది అందరిది' శీర్షికతో ఎస్.వి.నాగభూషణం ఒక అపురూప సంకలనం గ్రంథంగా ప్రచురించడం ముదావహం. శ్రీకృష్ణునికి సంబంధించి అన్నమయ్య, క్షేత్రయ్య, మీరాబాయి మొదలగు వాగ్గేయకారుల కృతులతో పాటు అనేక సినీ కవులు రాసిన శ్రీకృష్ణ సంబంధిత గీతాలను చేర్చి నిజంగానే పాటల బృందావనంగా అందించారు. సినిమాల కోసమే కాకుండా ప్రైవేటుగా వెలువడిన శ్రీకృష్ణుడి గీతాలు పద్యాలను చివరగా చేర్చారు. ఒక విధంగా శ్రీకృష్ణ 'గీత' విజ్ఞాన సర్వసం అని చెప్పవచ్చు. శ్రీకృష్ణగాన పిపాసులకు నిస్సంశయంగా ఈ పుస్తకం గీతామృతమే! ఈ పుస్తకంలో శ్రీకృష్ణుని పాటలతో పాటు ఆయా సినిమాలలోని ఛాయాచిత్రాలు చేర్చడం అదనపు ఆకర్షణ. 'తెలుగు సినిమాలలో శ్రీకృష్ణుడు'అనే అంశంపైన ఎవరైనా పరిశోధన ప్రారంభిస్తే ఈ పుస్తకం వారి పాలిట కల్పవృక్షమే అవుతుంది. ఈ పుస్తక రూపకల్పనలో సంకలనకర్త పడిన శ్రమ, తీసుకొన్న శ్రద్ధ, అణువణువున కనిపిస్తుంది. దీనికి సినీ విమర్శక భీష్మాచార్యుడనదగిన వి.ఏ.కె.రంగారావు ఆమోదిస్తూ రాసిన ముందుమాట పుస్తక విలువను తెలియజేస్తుంది. అయితే ఎంతో జాగ్రత్తతో రూపొందించిన ఈ సంకలన గ్రంథంలో చాలా ప్రాచుర్యం పొందిన సినీ శ్రీకృష్ణ గీతాలు చోటుచేసుకోకపోవటం కాస్త నిరాశే కలిగిస్తుంది. ఉదాహరణకు.. శ్రీకృష్ణ కృష్ణ కృష్ణా గోపాల బాలకృష్ణా (వీరాంజనేయ 1967), కన్నెల వలపు వెన్నలు దోచే కన్నయ్య (గోవుల గోపన్న 1968), కృష్ణయ్యా గడసరి కృష్ణయ్యా (సప్తస్వరాలు 1969), చిటుకు చిటుకుమంటు (మంచిబాబాయ్ 1978), అందాలొలికే నందకిషోరుడు బృందావనిలో వెలిశాడు (పిల్లజమీందార్ 1979), యమునా తీరాన రాధ మదిలోన కృష్ణుని ప్రేమకథ (గౌరవం 1980)%ా% ముఖ్యంగా పేర్కొనదగిన పాటలలో శరత్‌బాబు మాధవి నటించిన మూడు ముళ్ళబంధం (1980)లో సత్యం సంగీతంలో జానకి, శైలజ పాడిన సినారె గీతం 'రాధాకృష్ణయ్యా, ఇటు రారా కృష్ణయ్యా!' అలాగే 'దేవత' (1982) చిత్రంలో చక్రవర్తి సంగీతంలో సుశీల, శైలజ పాడిన 'అల్లరి కృష్ణుడు అందరి కృష్ణుడు, ఎవ్వరివాడమ్మా' పాటలో దేవకి యశోదలు కృష్ణుని కోసం ఆరాటపడిన తీరు వ్యక్తమైంది. ఈ పాటలన్నీ ఎంతో ప్రజాదరణ పొంది, ప్రాధాన్యం సంతరించుకొన్న కృష్ణుడి సంబంధిత గీతాలే! అలాగే శ్రీకృష్ణ విజయం, నా తమ్ముడు, అదృష్టవంతులు మొదలైన చిత్రాలలోని కొన్ని పాటలు చేర్చే అవకాశం లేకపోలేదు. 'రావమ్మా మహాలక్ష్మి' (ఉండమ్మా బొట్టూ పెడత) వంటి కొన్ని పాటలలో కృష్ణ శబ్దం తప్పితే సాహిత్యం వేరుగా ఉండటం వల్ల వీటిని చేర్చాల్సిన అవసరం అంతగా లేదు. ఈ మార్పులుచేర్పులు మలి ముద్రణ లో చోటుచేసుకుంటాయని ఆశించవచ్చు. శ్రీకృష్ణుని సేవించేవారు మొదలుకొని సినీ గీతాలను అభిమానించే ప్రతివారు కొని పదిలంగా దాచుకునే పుస్తకం ఇది.